


# విజయభాను




విశాఖపట్నం, బుధవారం 24-08-2023 VIJAYABHANU DAILY * VISAKHAPATNAM సంపుటి : 47 సంచిక : 276 పేజీలు : 08 వెల : 1 రూపాయి

# చంద్రుడిపై భారత్ విజయం



- చంద్రుని దక్షిణ ధ్రువంపై దిగనున్న విక్రమ్ ల్యాండర్
- జయహో భారత్.. సాహో ఇస్రో
- జాబిల్లిని సొంతం చేసుకున్న భారత్
- 140 కోట్ల భారతీయుల సొంతం

## ల్యాండర్ విక్రమ్ తీసిన జాబిల్లి చిత్రాలివే..

బెంగళూరు: చంద్రయాన్ 3ని విజయవంతంగా ప్రయోగించి అంతరిక్ష చరిత్రలో ఇస్రో సువర్ణ ఘట్టాన్ని లిఖించిన విషయం తెలిసిందే. బుధవారం సాయంత్రం జాబిల్లిపై అడుగుపెట్టిన ల్యాండర్ విక్రమ్.. కొన్ని నిమిషాల్లోనే భూమిపై ఉన్న పర్యవేక్షణ కేంద్రం తో కమ్యూనికేట్ చేసింది. బెంగళూరులోని ఈ కేంద్రానికి తాజా ఫొటోలను పంపింది. ల్యాండర్ దిగుతున్న సమయంలో హారిజాంటల్ వెలాసిటీ కెమెరా తీసిన చిత్రాలను ఇస్రో పోస్ట్ చేసింది.



బెంగళూరు: యహో భారత్. ఇస్రో అంచనాలు తప్పలేదు. యావత్ భారతం ఉత్కంఠంగా ఎదురు చూసిన క్షణాలు ఫలించాయి. ఎవరూ చూడని.. అడుగు మోపని చంద్రుడి భూభాగంలో భారత్ తొలి అడుగు వేసి సరికొత్త చరిత్ర సృష్టించింది. చంద్రయాన్-3 ప్రయోగంతో చంద్రుడి దక్షిణ ధ్రువంలో అడుగు మోపిన తొలి దేశంగా ఘనత సాధించింది.

ఓటమి గెలుపునకు నాంది..

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ చంద్రయాన్-2 వైఫల్యంతో మంచి పాఠాలే నేర్చింది. అందుకే చంద్రయాన్-3లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా తీర్చిదిద్దింది. ఆగస్టు 5న విజయవంతంగా చంద్రుడి కక్ష్యలోకి చేర్చారు. క్రమంగా కక్ష్యలను తగ్గిస్తూ చందమామకు చేరువ చేశారు. ఆ తర్వాత ఆగస్టు 17న ఈ వ్యోమనౌకలోని విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్‌తో కూడిన 'ల్యాండర్ మాడ్యూల్' ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి విజయవంతంగా విడిపోయింది. సొంతంగా చంద్రుడి కక్ష్యలో పరిభ్రమించింది. ఆ తర్వాత రెండు సార్లు డీ-ఆర్బిట్ ప్రక్రియలు చేపట్టి ల్యాండర్‌ను జాబిల్లి ఉపరితలానికి దగ్గర చేశారు.

41 రోజుల ప్రయాణం..

విక్రమ్ పరాక్రమ్.. అలా బుధవారం సాయంత్రం 5.44 గంటల ప్రాంతంలో ల్యాండర్ మాడ్యూల్.. ల్యాండింగ్‌ను నిర్దేశించిన ప్రాంతానికి చేరుకుంది. ఈ క్రమంలోనే ఇస్రో.. ల్యాండింగ్ మాడ్యూల్‌కు ఆటోమేటిక్ ల్యాండింగ్ సీక్వెన్స్ కమాండ్‌ను పంపించింది.

ఈ కమాండ్‌ను అందుకున్న ల్యాండర్ మాడ్యూల్.. తన కృత్రిమ మేధ సాయంతో సాఫ్ట్ ల్యాండింగ్ మొదలుపెట్టింది. తన నాలుగు థ్రాటల్‌బుల్ ఇంజిన్లను ప్రజ్వలించి తన వేగాన్ని తగ్గించుకుంది. రఫ్ బ్రేకింగ్ దశను విజయవంతంగా ముగించుకుని జాబిల్లి ఉపరితలం నుంచి 7.4 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకుంది. ఆ తర్వాత ల్యాండర్ మాడ్యూల్ తన దిశను మార్చుకుంది. ల్యాండర్ పొజిషన్ డిటెక్షన్ కెమెరా (ఎల్‌పీడీసీ), కేఏ బ్యాండ్ అండ్ లేజర్ బేస్డ్ ఆల్టీమీటర్లు, లేజర్ డాప్లర్ వెలోసీమీటర్ వంటి సాధనాలతో గమ్యాన్ని నిర్దేశించుకుంది. ఆ తర్వాత దశల వారీగా నెమ్మదిగా జాబిల్లి ఉపరితలానికి కొన్ని మీటర్ల ఎత్తులోకి చేరింది. చివరిగా ల్యాండింగ్‌కు అనువైన ప్రదేశాన్ని ఎంచుకుని దిగ్విజయంగా చంద్రుడిపై కాలుమోపింది.

తొలి దేశంగా సరికొత్త చరిత్ర..

జాబిల్లి దక్షిణ ధ్రువం..! అంతరిక్ష రంగంలో ప్రబల శక్తులుగా పేరున్న అమెరికా, రష్యా, చైనాలకు సైతం అందని ద్రాక్ష అది. అలాంటి కఠినమైన చోట వ్యోమనౌకను సురక్షితంగా దించి భారత్ సరికొత్త చరిత్రను సువర్ణాక్షరాలతో లిఖించింది. జాబిల్లి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన తొలి దేశంగా అవతరించింది.

## ఈ క్షణం కోసం ఎన్నో ఏళ్లు ఎదురు చూశా

### నా జన్మ ధన్యమైంది.. ప్రధాని మోదీ
### సూర్యుడిపైనా ప్రయోగాలు : మోదీ



అంతరిక్ష చరిత్రలో ఇస్రో సరికొత్త చరిత్ర సృష్టించింది. చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతమైంది. యావత్ ప్రపంచం ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తోన్న ఈ ఉద్విగ్న క్షణాల మధ్య చంద్రయాన్ చందమామపై అడుగుపెట్టడంపై ప్రధాని నరేంద్ర మోదీ అమితానందం వ్యక్తంచేశారు. చంద్రయాన్ తరువాయి 2లో..

## యావత్ దేశానికి ఎంతో గర్వకారణం - ఇస్రో చీఫ్ సోమనాథ్



స్వప్నం సాకారమైంది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ అద్భుతాన్ని సృష్టించింది. నరాలు తెగే ఉత్కంఠకు తెరదించుతూ.. యావత్ భారతావని ఆకాంక్షలను నెరవేరుస్తూ.. విక్రమ్ ల్యాండర్ జాబిల్లిపై విజయవంతంగా అడుగుపెట్టింది. ప్రపంచ అంతరిక్ష పరిశోధనల్లోనే సరికొత్త అధ్యయనానికి శ్రీకారం చుట్టింది. దీనిపై స్పందించిన ఇస్రో ఛైర్మన్ సోమనాథ్.. ఇందుకోసం కృషి చేసి ప్రతిఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

"దేశం కోసం స్ఫూర్తిదాయక కార్యం సాధించినందుకు ఎంతో గర్వంగా ఉంది. ఇస్రో శాస్త్రవేత్తలను ప్రధాని మోదీ అభినందించారు. ఇస్రోకు మద్దతుగా నిలిచిన ప్రధాని మోదీకి ధన్యవాదాలు. చంద్రయాన్-3 విజయవంతం అవ్వాలని కొన్ని రోజులుగా ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. చంద్రయాన్-2 నుంచి నేర్చుకున్న పాఠాలు ఎంతో ఉపయోగపడ్డాయి. సాఫ్ట్ లాంచ్ అంత సులభమైన విషయం తరువాయి 2లో..

## నాలుగేళ్లు ఎదురుచూశా.. చాలా ఆనందంగా ఉంది: ఇస్రో మాజీ చీఫ్ శివన్



బెంగళూరు: చంద్రయాన్ 3 ప్రయోగం విజయవంతం కావడంపై ఇస్రో మాజీ ఛైర్మన్ కె. శివన్ హర్షం వ్యక్తంచేశారు. ఇంత అద్భుతమైన విజయం సాధించిన ఇస్రోను అభినందించారు. ఈ చారిత్రక విజయం ఎంతో సంతోషాన్నిచ్చిందని.. ఈ క్షణం కోసం ఎంతోకాలంగా ఎదురు చూసినట్టు చెప్పారు. ఓ వార్తా సంస్థతో ఆయన మాట్లాడుతూ.. "ఇదో గ్రాండ్ సక్సెస్. ఈ విజయం కోసం గత నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్నాం. చాలా స్వీట్ న్యూస్. దేశమంతా ఎదురుచూస్తున్న ఈ ప్రయోగం ఇప్పుడు విజయవంతమైంది. చాలా ఆనందంగా ఉంది. అద్భుత విజయం సాధించిన ఈ క్షణాన దేశ ప్రజలందరికీ అభినందనలు. ప్రభుత్వం కూడా సహకరించింది. చంద్రయాన్ 3 పంపించే సైన్స్ డేటా ఒక్క భారత్ కోసమే కాదు.. యావత్ ప్రపంచ సైంటిస్టులందరి కోసం. ఈ డేటాను ప్రపంచవ్యాప్తంగా సైంటిస్టులు వినియోగించి కొత్త విషయాలు కనుగొనేందుకు ఉపయోగపడుతుంది. ఇందులో ప్రపంచ ప్రయోజనాలు ఉన్నాయి" అన్నారు.

2019లో చంద్రయాన్-2 ల్యాండర్ విజయానికి అడుగు దూరంలో కుప్పకూలడంపై అప్పటి ఇస్రో చీఫ్‌గా ఉన్న శివన్ కన్నీళ్లు పెట్టుకోవడాన్ని యావత్ దేశం దిగ్భ్రాంతితో వీక్షించిన విషయం తెలిసిందే. అప్పట్లో ప్రధాని నరేంద్ర మోదీ ఆయన్ను ఓదార్చారు. మరోసారి ప్రయత్నిద్దామని భరోసా ఇవ్వగా.. తాజాగా ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ సారథ్యంలో ఆ ప్రయోగం గ్రాండ్ సక్సెస్ సాధించడం విశేషం.

## జాబిల్లిపై జాతీయ చిహ్నం, ఇస్రో లోగో

దిల్లీ: చంద్రమామపై విక్రమ్ ల్యాండర్ విజయవంతంగా అడుగుపెట్టింది. ఇక ప్రగ్యాన్ రోవర్ బయటికి రావడమే తరువాయి. ల్యాండర్ నుంచి రోవర్ బయటికి వచ్చిన తర్వాత సెకనుకు సెంటీమీటరు వేగంతో కదులుతుంది. అంతేకాదు ఇస్రో సాధించిన ఘనతకు గుర్తుగా చంద్రుడి ఉపరితలంపై ప్రగ్యాన్ రోవర్ దేశ జాతీయ చిహ్నం తో పాటు ఇస్రో లోగోను ముద్రించనుంది.

ఏడిపించావు మామా.. గెలిచేందుకే వచ్చాం..!

ఇందుకు తగినట్లుగా రోవర్ ఆరు చక్రాలను డిజైన్ చేశారు. ఇందులో కుడివైపు చక్రాలు ఇస్రో లోగోను, ఎడమవైపు చక్రాలు జాతీయ చిహ్నాన్ని ముద్రించనున్నాయి. 14 రోజుల పాటు చంద్రుడి ఉపరితలంపై ప్రగ్యాన్ రోవర్ సంచరిస్తూ ల్యాండర్‌కు కమ్యూనికేట్ చేస్తుంది. ప్రగ్యాన్ రోవర్‌లో ఉన్న రెండు పేలోడ్‌లు చంద్రుడిపై ఉన్న వాతావరణ పరిస్థితులు, ఉపరితల నిర్మాణం వంటి



అంశాలను పరిశీలిస్తాయి. దాంతోపాటు మట్టి, రాళ్లలో ఉన్న రసాయాలను గుర్తించి ఆ సమాచారాన్ని విశ్లేషిస్తాయి.

## చంద్రయాన్-3 విజయంపై సీఎం జగన్ ట్వీట్



అమరావతి : చంద్రయాన్-3 విజయవంతం కావడం పట్ల ఇస్రో శాస్త్రవేత్తలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. "ఇది భారత్‌కు అపురూపమైన విజయం. చంద్రునిపై చంద్రయాన్-3 విజయవంతంగా సాఫ్ట్ ల్యాండింగ్ అయినందుకు, నాతో సహా దేశంలోని ప్రతి పౌరుడు గర్వంగా ఫీలవుతున్నారు. ఇస్రో బృందానికి నా శుభాకాంక్షలు మరియు అభినందనలు. ఈ అపురూపమైన ఫీట్‌ని శ్రీహరికోట నుంచే సాధించాం. ఇది ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకం" అంటూ సీఎం జగన్ ట్వీట్ చేశారు. జయహో భారత్. ఇస్రో అంచనాలు తప్పలేదు. యావత్ భారతం ఉత్కంఠంగా ఎదురు చూసిన క్షణాలు ఫలించాయి. ఎవరూ చూడని.. అడుగు మోపని చంద్రుడి భూభాగంలో భారత్ తొలి అడుగు వేసి సరికొత్త చరిత్ర సృష్టించింది. చంద్రయాన్-3 ప్రయోగంతో చంద్రుడి దక్షిణ ధ్రువంలో అడుగు మోపిన తొలి దేశంగా ఘనత సాధించింది.




# గడపగడపకు మన ప్రభుత్వం



రాజాం (విజయభాను న్యూస్) : రాజాం మండలంలో గురవాం గ్రామంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. రాజాం ఎమ్ఎల్ఏ కంబాల జోగులు ఇంటింటికి వెళ్లి లబ్దిదారులకు బుక్ లెట్ లు అందించారు. సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు పార్టీలతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని అన్నారు. ఈకార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ కన్వీనర్లు లావేటి రాజగోపాలనాయుడు, కరణం సుదర్శనరావులు, వైస్ ఎంపీపీలు నక్క వర్షిణి, యాలాల వెంకటేష్ లు, స్థానిక సర్పంచ్ భేరి రమణమ్మ, ఆల్తి రాంబాబు, ఉప సర్పంచ్ ఆల్తీ సత్యన్నారాయణ, వంజరాపు విజయ్ కుమార్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



పుదుచ్చేరి డీజీపీ కార్యాలయాన్ని రూ.9 కోట్ల అంచనా వ్యయంతో రెండు దశల్లో నిర్మించేందుకు గౌరవ హెూంమంత్రి నమచివాయం నేతృత్వంలో పోలీసు శాఖ ఉన్నతాధికారులతో సంప్రదింపులు. పుదుచ్చేరి హెూంమంత్రి నమచివాయంలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయి. పుదుచ్చేరి డీజీపీ కార్యాలయాన్ని రెండు దశల్లో రూ.9 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. వ్యాపారుల బెదిరింపులు దళారులను అణిచివేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పుదుచ్చేరిలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయి. పోలీసు అధికారులతో సంప్రదింపుల సమావేశం అనంతరం హెూంమంత్రి నమచివాయం పుదుచ్చేరిలో ఫ్లవర్ గార్డెన్ ఏర్పాటుకు తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.



దక్షిణ నియోజకవర్గం 29వ వార్డు పరిధిలో వున్నా రెండు నిరుపేద కుటుంబలకు స్థానిక వార్డ్ కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, ఆంధ్రప్రదేశ్ బీసీ వెల్ఫేర్ వైస్ ప్రెసిడెంట్ ఉరికీటీ నారాయణ రావు అన్న ఆధ్వర్యంలో విశాఖ దక్షిణ నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు సీతంరాజు సుధాకర్ ఆర్థిక సహాయంతో... కృష్ణానగర్ ఏరియాలో నివాసముంటున్న కీర్తిశేషులు లెక్కల దాలినాయుడు అనే ఒక నిరుపేద కుటుంబానికి, రెండు నెలల పోషకాహారంతోపాటు, ఆర్థిక సహాయం కూడా చేయడం జరిగింది.అలాగే వెంకటపతి రాజు నగర్ లో నివాసం ఉంటున్న సింగంపల్లి శివకుమార్ (ఫుట్ బాల్ ఆటగాడు ) రెండు కిడ్నీలు ఫెయిల్ అయిన కారణంగా కుటుంబ పోషణ ఇబ్బందికరంగా ఉందని తెలుసుకొని రెండు నెలల పోషకాహారంతో పాటు, ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గున్నారు...

## టంగుటూరి ప్రకాశం పంతులు సేవలు అభినందనీయం

### పరవాడ ఎంపీపీ పైలా వెంకట పద్మ లక్ష్మి శ్రీనివాస్



పరవాడ : పరవాడ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధులు, ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా కార్యాలయం మీటింగ్ హాల్ లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన పరవాడ మండల ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు . ఈ సందర్భంగా ఎంపీపీ పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా టంగుటూరి ప్రకాశం పంతులు రాష్ట్రానికి, దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయం అని ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనలో ఆయన పాత్ర కీలకం అని,తన జీవితాన్ని ప్రజా సేవకు అంకితం చేసిన ఆ మహనీయుడు ప్రకాశం పంతులు (1872 ఆగష్టు 23 - 1957 మే 20) సుప్రసిద్ధ స్వాతంత్ర్య సమర యోధుడు, ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రి. నిరుపేద కుటుంబంలో పుట్టి, వారాలు చేసుకుంటూ చదువుకుని, ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి అయ్యాడు. 1940, 50 దశకాల్లో ఆంధ్ర రాజకీయాల్లో ప్రముఖంగా వెలుగొందిన వ్యక్తుల్లో ప్రకాశం ఒకడు. ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధనలో నిర్ణాయక పాత్ర పోషించాడు.

మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో తుపాకి కెదురుగా గుండెనుంచి ఆంధ్రకేసరి అని పేరు పొందినవాడు. ఈ యొక్క కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు , వైస్ ఎంపీపీ బూస అప్పలరాజు, పరవాడ హేమ సుందరరావు, మండల జె సి ఎస్ కన్వీనర్ వెన్నెల సన్యాసిరావు, మాజీ ఆర్ ఇ సి ఎస్ చైర్మన్ చల్ల కనకరావు, పరవాడ పెద్ద చెరువు రైతు సంఘం అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసరావు, వై.సి.పి నాయకులు కావలి రాజు, కావలి వాసు, వర్రీ హరి, తదితరులు పాల్గొన్నారు.

# గీతం న్యాయ కళాశాల ఆధ్వర్యంలో మూట్‌కోర్టు పోటీ

సాగర్‌నగర్ **(విజయభాను న్యూస్) :** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యంలలో ఈ ఏడాది అక్టోబర్ 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు జాతీయ స్థాయి మూట్ కోర్టు పోటీలను వర్చువల్‌గా నిర్వహిస్తున్నట్లు డైరక్టర్ ప్రొఫెసర్ అనితారావు తెలిపారు. గీతం మూట్ మరియు అడ్వకసీ కమిటి ఆధ్వర్యంలో గీతం వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్. మూర్తి పేరుతో గత మూడు సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ఈ పోటీలను ప్రముఖ న్యాయ నిపుణల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నామన్నారు. న్యాయ వృత్తిలో పాటించాల్సిన మెళకువలుపై విద్యార్థులకు ప్రాక్టికల్ అనుభవాన్ని అందించడంతో పాటు, న్యాయస్థానంలో వాదోపవాదాలపై వృత్తి నైపుణ్యాన్ని పెంచటానికి ఈ మూట్ కోర్టు పోటీలను నిర్వహిస్తున్నామని డైరక్టర్ తెలిపారు. ఎల్.ఎల్.బి మరియు ఎల్.ఎల్.ఎమ్ కోర్సులు అభ్యసించే విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనవచ్చునన్నారు. ప్రతి న్యాయ కళాశాల నుంచి ముగ్గురు ఒక జట్టుగా మాత్రమే అనుమతిస్తామని తెలిపారు.

ఈ ఏడాది మూట్ కోర్టు పోటీలలో న్యాయ విద్యార్థులు చర్చించాల్సిన అంశం గూర్చి గీతం మూట్ కోర్టు పోటీల వెబ్ సైట్ mcc.schooloflaw@gitam.eduను పరిశీలించ వచ్చునన్నారు. గీతం మూట్ కోర్టు పోటీలో విజేతలకు ప్రధమ బహుమతిగా రూ. 50 వేల రూపాయలు, ద్వితీయ బహుమతిగా రూ.25 వేల రూపాయలు, ప్రశంసా పత్రాన్ని అందజేస్తామన్నారు. ఉత్తమ స్పీకర్, ఉత్తమ రీసెర్చర్, ఉత్తమ మెమోరియల్‌గా ఎంపికైన వారికి రూ. 10 వేల చొప్పున నగదు బహుమతి, ప్రశంస పత్రం అందజేస్తామని తెలిపారు. ఆసక్తి గల న్యాయ కళాశాలలు ఈ పోటీలో పాల్గొనటానికి సెప్టెంబర్ 15వ తేదీలోగా తమ వివరాలను వెబ్‌సైట్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

ఇతర వివరాలకు గీతం స్కూల్ ఆఫ్ లా మూట్ కోర్టు పోటీల నిర్వాహక కమిటిని సంప్రదించాల్సిందిగా సూచించారు.

## ఏయూతో అమృత సంస్థ ఎంఓయూ

ఆంధ్రవిశ్వవిద్యాలయం **(విజయభాను న్యూస్) :**

ఆంధ్రవిశ్వవిద్యాలయంతో అమృత సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంది. బుధవారం ఒప్పంద పత్రాలపై ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత సమక్షంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అమృత సంస్థ అద్యక్షురాలు డాక్టర్ ఏ.ఇందుమణిలు సంతకాలు చేసారు. అవగాహన ఒప్పందంలో భాగంగా ఏయూ సూచించిన విధంగా ఏడాది కాలవ్యవధితో పిజి డిప్లమా ఇన్ యోగా, ఆరు నెలల కాలవ్యవధితో డిప్లమా ఇన్ యోగా కోర్సులను అమృత సంస్థ నిర్వహిస్తుంది. కార్యక్రమంలో యోగా కేంద్రం సంచాలకులు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు భానుకుమార్, విభాగాధిపతి డాక్టర్ కె.రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## విశాలాంధ్ర విలేకరిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి ప్రజా సంఘాల డిమాండ్




పరవాడ : మండలానికి చెందిన విశాలాంధ్ర విలేఖరి పల్లి వెంకటరమణపై పల్లా అప్పారావు తదితరులు దాడి చేయడాన్నివి పరవాడ మండల ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు ప్రజా సంఘాలుతీవ్రంగా ఖండించారు. ఈ మేరకు పరవాడలో ఆంధోళన చేపట్టి నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేసారు. ఎమ్మార్వో జంక్షన్ నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు అనంతరం డిప్యూటీ తాసిల్దార్ కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ భారత ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా ఉన్న మీడియాపై భౌతిక దాడులకు దిగడం దారుణమని మండిపడ్డారు. వార్తలో తప్పు ఉంటే చర్యలు తీసుకునే అవకాశం ఉన్నప్పటికీ అహంకారంతో కొందరు నాయకులు దాడులు చేస్తున్నారని, ఇలాంటి దుశ్చర్యలను అరికట్టాలని డిమాండ్ చేసారు. జర్నలిస్టుల రక్షణకు పటిష్ట చట్టాలు రూపొందించాలని విజ్ఞప్తి చేసారు. వెంటనే అప్పారావుని వారి అనుచరులని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో జర్నలిస్టుల సంఘం నేతలు సిఐటియు నేత గని శెట్టి సత్యనారాయణ, కాంగ్రెస్ ఆర్ఆర్ నాయుడు, తెలుగుదేశం పైలా అక్కు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వర్జిన్ కోకోనట్ ఆయిల్తో చిన్నారులకు అత్యుత్తమ పోషణ

విశాఖపట్నం : చిన్నారులకు అత్యుత్తమ పోషణను పారాచూట్ అడ్వాన్స్‌డ్ వర్జిన్ కోకోనట్ ఆయిల్ అందించనుందని మారికో లిమిటెడ్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ సోమశ్రీ బోస్ అవస్తి తెలిపారు. తరతరాలుగా చక్కని సంరక్షణ, పోషణకు మారుపేరుగా ఉన్న పారాచూట్ అడ్వాన్స్‌డ్ ఇప్పుడు బేబీ శ్రేణిని సగర్వంగా ఆవిష్కరించిందన్నారు. ఏళ్ల తరబడి మహిళలకు నమ్మకమైనదిగా ఉన్న పారాచూట్ ఇప్పుడు శిశువుల సంరక్షణను కూడా అందిస్తోందన్నారు. నవజాత శిశువులకు సురక్షితమైనదిగా పేర్కొన్నారు. ఈ ఉత్పత్తులు ఆరు రకాలుగా.. అవి మసాజ్ ఆయిల్, పోషణతో కూడిన సబ్బు, షాంపూ, లోషన్, క్రీమ్, రిఫ్రెషింగ్ పౌడర్లు ఉన్నాయన్నారు. ఇవి శిశు వుల సున్నితమైన చర్మానికి సరైన సంరక్షణను అందించడానికి రూపొందించామని తెలిపారు.

అన్ని ఉత్పత్తులు వంద శాతం వర్జిన్ కోకోనట్ ఆయిల్ గుణాలతో సమృద్ధిగా ఉంటాయన్నారు. వీటిలో కొన్ని పోషకాలు సహజ మూలాలు తల్లి పాలలో కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ బ్రాండ్ (పారాచూట్ అడ్వాన్స్‌డ్) స్వచ్ఛతను కలిగి ఉంటుందన్నారు.

# ఈ క్షణం కోసం ఎన్నో ఏళ్లు ఎదురు చూశా

3 ప్రయోగాన్ని దక్షిణాఫ్రికా నుంచి వర్చువల్‌గా వీక్షించిన ఆయన ఈ ప్రయోగం విజయవంతం అయిన వెంటనే చప్పట్లతో అభినందించారు. మువ్వన్నెల జెండాను ప్రదర్శించారు. అనంతరం ఇస్రో శాస్త్రవేత్తల కృషిని అభినందించారు. ఇలాంటి చారిత్రిక ఘట్టాలు చూస్తుంటే చాలా గర్వంగా ఉంటుందన్నారు.

నా జన్మ ధన్యమైంది..

"ఇస్రో శాస్త్రవేత్తలు, చంద్రయాన్ బృందానికి నా అభినందనలు. ఈ క్షణం కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూశా. అద్భుత విజయం కోసం 140 కోట్ల మంది ప్రజలు ఎదురు చూశారు. ప్రపంచంలోనే తొలిసారిగా చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టాం. చంద్రయాన్ ఘన విజయంతో నా జీవితం ధన్యమైంది. ఈ విజయం దేశం గర్వించే మహత్తర క్షణాలు. చంద్రయాన్ విజయం నవభారత జయధ్వానం. బ్రిక్స్ సమావేశాల్లో ఉన్నా నా మనసంతా చంద్రయాన్‌పైనే ఉంది. ఈ క్షణం కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూశా. భారత్ సరికొత్త చరిత్ర సృష్టించింది. అమృత కాలంలో తొలి ఘన విజయం. ఇప్పటివరకు చంద్రుడి దక్షిణ ధ్రువంపై ఏ దేశమూ చేరుకోలేదు. మన శాస్త్రవేత్తల కఠోర శ్రమవల్లే ఈ విజయం సాధించగలిగాం. భారత్ సాధించిన ఈ అద్భుత విజయం ఒక్క మన దేశానిది మాత్రమే కాదు.. మానవాళి అందరిదీ.." అని మోదీ తన ప్రసంగంలో వ్యాఖ్యానించారు.

సూర్యుడిపైనా ప్రయోగాలు : మోదీ

'అమృతకాలంలో తొలిఘన విజయమిది. భూ మాతను తల్లిగా.. చంద్రుడిని మామగా పిలుచుకుంటాం. చందమామ ఎంతో దూరమని ఇప్పటివరకు చెప్పుకొన్నాం. ఇకపై మనకు చందమామ ఎంతో దూరం కాదు. చంద్రుడితోనే ప్రయోగాలు ఆగవు. సూర్యుడిపైనా కొనసాగిస్తాం. అంతరిక్షంలోకి మనుషులను కూడా పంపుతాం. శుక్రుడు, అంగారక గ్రహాలపైనా ప్రయోగాలు కొనసాగిస్తాం' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## యావత్ దేశానికి ఎంతో గర్వకారణం

*కాదు. వచ్చే 14 రోజులు ఎంతో ఆసక్తికరం. చంద్రయాన్-3ని ప్రతి భారతీయుడు ఎంతో ఆసక్తికగా చూస్తారు. ప్రతి ఒక్కరూ చంద్రయాన్ విజయం కోసం ప్రార్థించారు.*

*వచ్చే నెలలో ఆదిత్య ఎల్-1 లాంచ్ చేస్తున్నాం..*

*ఆదిత్య ఎల్-1ను వచ్చే నెలలో లాంచ్ చేస్తున్నాం. ఆదిత్య.. సూర్యుడి గురించి తెలుసుకునేందుకు ఉపయోగపడనుంది. గగన్ యాన్ అబర్ట్ మిషన్ కూడా అక్టోబరు మొదటి వారంలోపు చేస్తాం. విక్రమ్ హెల్త్ కండిషన్ చూడాలి. విజ్ఞాన్ రోవర్ వచ్చే 24గంటల్లోపు చంద్రుడిపై దిగనుంది. చంద్రయాన్-2లో పనిచేసిన అనేక మంది చంద్రయాన్-3కి పనిచేశారు. చంద్రయాన్-2కి పనిచేసిన వారు గత కొన్నేళ్లుగా సరిగా నిద్రకూడా పోయి ఉండరు. ఇస్రో చాలా బలంగా ఉంది' అని సోమనాథ్ పేర్కొన్నారు.*

## భారత్ సరికొత్త చరిత్ర సృష్టించింది :మాజీ మంత్రి కోండ్రు



రాజాం : చంద్రుని దక్షిణ ధృవం పై విజయవంతంగా రోవర్ ని దించిన దేశంగా భారతదేశాన్ని నిలిపి చరిత్ర సృష్టించిన ఇస్రో శాస్త్రవేత్తలకు.సాంకేతిక నిపుణులకు. సిబ్బందికి చంద్రయాన్ -3 సూపర్ సక్సెస్ పై మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఇన్చార్జి కోండ్రు మురళీమోహన్ ధన్యవాదాలు తెలియజేస్తూ పత్రికా ప్రకటన విడుదల చేశారు.భారతదేశం సరికొత్త చరిత్ర సృష్టించిం దన్నారు. క్షణ క్షణం ఉత్కంఠ భరితంగా ఎంతో సక్సెస్ ఫుల్ గా విక్రమ్ సాఫ్ట్ లాండింగ్ అవ్వడం దేశానికి గర్వకారణం అన్నారు.అమెరికా. చైనా.జపాన్ వంటి అగ్రదేశాలకు కూడా సాధ్యం కాని పనిని చేసి చూపించిందని కోండ్రు అన్నారు. ప్రపంచం చరిత్రలో చంద్రుడి దక్షణ దృవంపై అడుగుపెట్టిన మొట్టమొదటి దేశంగా భారత్ నిలిచింది. హాలీవుడ్ మూవీ కంటే తక్కువ బడ్జెట్లోని ఈ ప్రయోగం చేసి అందరిని షాక్ కి గురి చేసిందన్నారు.

నేడు చందమామ పై భారత జెండా రెపరెపలాడటం ప్రపంచదేశాలు భారత్ వైపు చూస్తుందని ఇది ప్రపంచదేశాలకు స్పూర్తి అని కోండ్రు కొనియాడారు.

## ప్రత్యేక హెూదా విశాఖ ఉక్కు రక్షణ కోసం జై ఆంధ్ర ఉద్యమం



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** ప్రత్యేక హెూదా విశాఖ ఉక్కు రక్షణ కోసం జై ఆంధ్ర ఉద్యమం ఈ నెల 30న విజయవాడలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు జై ఆంధ్ర ఉద్యమనేత దేవరపల్లి మహేష్ తెలిపారు. విజేఎఫ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన ప్రత్యేక హెూదా విభజన చట్టం హామీలు ఉల్లంఘనకు గురైనా అధికార ప్రతిపక్ష పార్టీల సమైక్యవాదులు నేతలు నోరు మెదపడం లేదని రాష్ట్ర ప్రజలకు యువతకు తీరని అన్యాయం జరుగుతుంటే" మౌనం వహించడం కుట్రపూరితమైన మోసమేనని అన్నారు. ఎ.పి.కి 10. సం.లు ప్రత్యేక హెూదా కల్పిస్తానని మోసగించిన ప్రధాని మోడి మాయలోపడి ప్రస్తుత సంక్షోభానికి ఎవరు బాధ్యత తీసుకోవడం లేదని అన్నారు. ఎ.పికి ప్రత్యేక హెూదా నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ కల్పిస్తే నేటి ప్రధాని మోడి హెూదా ఇవ్వకుండా అన్యాయం చేస్తూ కాలయాపనతో ముగింపు పలకాలని చూస్తున్నారని అన్నారు - జై ఆంధ్ర జెఏసి చైర్మన్ చింతాడ సూర్యం మాట్లాడుతూ 9 సం.లు గడిచినా విభజన చట్టం హామీలకు అతీగతి లేదన్నారు. రాష్ట్రాన్ని రాష్ట్ర ప్రజలను చులకనగా హేళనగా వివక్షతతో చూడడం ప్రధాని మోడీకి తగదన్నారు. ఎ.పి. పట్ల చిత్తశుద్ధి ఉంటే ప్రత్యేక హెూదా కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 2024 ఎన్నికల్లో జై ఆంధ్ర అభ్యర్థులు రంగంలో దిగి పార్లమెంట్ అసెంబ్లీ ఎన్నికల్లో దిగి మోడీ మోసపూరిత విధానాలను ఎండగట్టి ప్రత్యేక హెూదా పార్లమెంట్ సాక్షిగానే సాధించుకుంటామన్నారు.

రాష్ట్ర జై ఆంధ్ర జెఏసి అధికార ప్రతినిధి గోరింత అప్పలరాజు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల వనరులు, అవకాశాలను ప్రైవేట్ వ్యక్తులు తన్నుకుపోతున్నారని, ఇక్కడ వనరులన్ని కూడా ఈ ప్రాంతం ప్రజలకే చెందాలని అన్నారు. ప్రత్యేక హెూదా విశాఖ ఉక్కును కాపాడుకోవడానికి ఎంతటి త్యాగాలకైన సిద్ధంగా ఉన్నామని దానికై 26 జిల్లాల నుంచి శాంతియుతమైన ఉద్యమం మా హక్కుపై చేపటతామని తెలిపారు. ఈ సమావేశంలో కట్ట మల్లేశ్వరి, సంజయ్, అంజనీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పి. బోనంగి కాలువ సమస్యపై జడ్పీటిసి పిఎస్ రాజు గళం



పరవాడ :-పరవాడ మండలం పి. బోనంగి లోగల కాలువ సమస్యపై జిల్లా పరిషత్ సమావేశం మండలి లో స్థానిక జడ్పీటిసి పిఎస్ రాజు గళం విప్పారు. 1991 లో ఆర్ అండ్ బి వాళ్లు రోడ్లు వేశారు. అవి ఇప్పుడు జిరాయితిగా చూపించడంతో స్థానికంగా ఉన్న రైతులు కాలువ నిర్మాణానికి అభ్యంతరం పెడుతున్నారని ఈ సమస్యను అతి తొందరలో పరిష్కరించి ప్రజలకి న్యాయం చేయాలని ఆయన జడ్పీ సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ జె. సుభద్రను ని కోరారు. ఈ సమస్యపై ఇదివరకు స్థానిక తాసిల్దారు వారు ఆర్డీవో పరిశీలించి న్యాయం చేస్తామని చెప్పి వెల్లడించారు. అయినా ఈ సమస్య పరిష్కారం కాకపోవడంపై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనితెలియజేశారు.

# జిల్లాలో ధాన్యం సేకరణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

## -జాయింట్ కలెక్టర్ కే.ఎస్.విశ్వనాథన్



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** జిల్లాలో ధాన్యం సేకరణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం కలెక్టరేట్లో తన చాంబర్లో ప్యాడి ప్రోక్యుర్మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం ఉత్పత్తి ఏ స్థాయిలో జరుగుతుందో అంచనా వేసి అందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇ-క్రాప్ బుకింగ్ మరియు ఇ-కెవైసి తప్పనిసరిగా చేయాలని సూచించారు. దీనికి సంబంధించి డైలీ రిపోర్ట్ తనకు అందజేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు మరియు ఆర్ బి కే లు ఏర్పాటు చేసి వాటిని వర్గీకరణ చేయాలని అన్నారు. క్లస్టర్ ఆర్ బి కే లలో టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు మరియు సహాయకుల నియామకం చేపట్టాలని అన్నారు. జిల్లాలో గన్ని బ్యాగులు ఏ మేరకు అవసరం అవుతాయో గుర్తించి నిల్వ చేయాలని అన్నారు . ధాన్యం కొనుగోలు కేంద్రాలు లో మౌలిక సదుపాయాల ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి, కే అప్పలస్వామి, జిల్లా పౌర సరఫరాల అధికారి జి సూర్యప్రకాశరావు, డిస్టిక్ మేనేజర్ సివిల్ సప్లైస్ ఐ రాజేశ్వరి, DTC, జిల్లా రవాణా అథారిటీ ఎం బుచ్చిరాజు,జిల్లా సహకార అధికారి పి.దుర్గాప్రసాద్, అసిస్టెంట్ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ పి డి వి అప్పలరాజు, అసిస్టెంట్ మేనేజర్ టెక్నికల్ ఎం సృజన, తదితర అధికారులు పాల్గొన్నారు.

# స్నేక్ క్యాచర్ ఆనంద్ కు ఘన సన్మానం




గాజువాక( విజయభాను న్యూస్) : విశాఖపట్నంలో మొట్ట మొదటి స్నేక్ క్యాచర్ కేరళ వాసి పి ఆనంద్ కు బుధవారం షిప్ యార్డ్ కాలనీ గల బాలకృష్ణ కల్యాణమండపం లో ఘనంగా సన్మానం జరిగింది. కాలనీ లో గత 35 సంవత్సరాలనుండి నివసిస్తూ కాలనీ గృహవాసుల లో ఎవరి ఇంటికైనా పాములు వచ్చిన సమాచారం తెలుసుకున్న మరు క్షణమే వచ్చి పాము ను పట్టి దూరం గా ఉన్న కొండలపై వదిలి వేసేవాడు. అలాగే విశాఖపట్నం లో అనేకమంది కి పాములు పట్టడంలో చాకచక్యం నేర్పారు. ఐతే అనుకోకుండా ఆయన మరల కేరళ వెళ్లిపోతున్న సందర్బంగా జరిగిన ఈ సన్మాన సభకు ముఖ్య అతిదులుగా విచ్చేసిన షిప్ యార్డ్ జనరల్ మేనేజర్ గుప్తా, కాలనీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ బేగ్, వైస్సార్ టీయూసీ నాయకులు బద్రీనాథ్,భోగవెల్లి నాగభూషణం,కార్పొరేటర్ గుండపు నాగేశ్వరావు షిపయార్డ్ యూనియన్ నాయకులు, అధికారులు, కాలనీ వాసులు పాల్గొని ఆనంద్ సేవలు కొనియాడారు.

# టాటా గ్రూప్ అంబులెన్స్ వితరణ

## నగర మేయర్ చేతుల మీదగా కేజిహెచ్ కు అందజేత



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** వాతావరణం లేదా వివిధ కారణాల వలన విపత్తులు సంభవించినప్పుడు వాటి నివారణ కార్యక్రమంలో పౌరులను భాగస్వామ్యం చేసేందుకు జివిఎంసి, ఎస్ఆర్యు సంయుక్తంగా కృషి చేస్తుందని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. బుధవారం ఆమె జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో టాటా గ్రూప్ ప్రతినిధుల తో విపత్తుల నివారణ గూర్చి చర్చించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ కమ్యూనిటీ ఆధారిత విపత్తుల ప్రమాద నిర్వహణ కార్యక్రమంలో (CBDRM) భాగంగా టాటా గ్రూప్ అత్యంత ఆధునికరమైన అంబులెన్స్ ను కింగ్ జార్జ్ హాస్పిటల్ కు అందించిందని మేయర్ తెలిపారు. దీనిని కింగ్ జార్జ్ హాస్పిటల్ పర్యవేక్షకులకు నేడు అందించామని తెలిపారు.

అంతేకాకుండా విపత్తులు సంభవించినప్పుడు ఆయా ప్రాంత ప్రజలకు అవసరమయ్యే కమ్యూనిటీ కిచెన్ సామాగ్రిని ఎంపిక చేసిన 20 ప్రాంతాలలో ఆయా ప్రాంత సంఘాల వారికి టాటా గ్రూప్ అందించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కట్టమూరి సతీష్, ప్రధాన వైద్యాధికారి నరేష్ కుమార్, టాటా గ్రూప్ ప్రతినిధులు శ్రీరంగ్, ఈప్సిత దాస్, విజయ్, ఎన్జీవోస్, కమ్యూనిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జనసేనాలోకి సిద్ధాంతాలు ఆశయాలు నచ్చి చేరికలు




గాజువాక(విజయభాను న్యూస్) : జనసేన పార్టీ ఆశయాలు, పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు నచ్చి ఇప్పటికే అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్య కర్తలు, వ్యాపార వేత్తలు, విద్యా వేత్తలు, మేధావులు, యువత, మహిళలు అధిక సంఖ్య లో పార్టీలో చేరుతున్నారని రాష్ట్ర జనసేన ప్రదాన కార్య దర్శి తమ్మారెడ్డి శివశంకర్ అన్నారు. జనసేన పార్టీలో చేరిన కార్మిక నాయకుడు గంధం వెంకటరావుకు స్థానిక కేటీబి కన్వెన్షన్లో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గడసాల అప్పారావు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ గ్రౌండ్ చదును



అనకాపల్లి విజయభాను న్యూస్: ఎన్టీఆర్ గ్రౌండ్లో వాకింగ్ చేస్తున్న వాకర్స్ కి క్రషర్ బుగ్గ వేయడం వల్ల చాలా ఇబ్బంది కలుగుతుందని 80 వార్డు ఇంచార్జ్ కొణతాల భాస్కర్ దృష్టికి తీసుకువెళ్లారు.స్పందించిన భాస్కర్ జీవీఎంసీ వారికి చెప్పి జెసిబి తో దగ్గరుండి గ్రౌండ్ను చదును చేయించారు.

# విద్యార్థినుల జోలికి వెళితే కఠిన చర్యలు

భీమునిపట్నం : విజయభాను న్యూస్. విద్యార్థినుల జోలికి వెళితే కఠిన చర్యలు తప్పవనీ ఎస్.ఐ భరత్ కుమార్ రాజు ఆకతాయిలుకు హెచ్చరించారు. భీమిలి జూనియర్ కళాశాలల వద్ద కళాశాలలకు వెళ్లి వచ్చే విద్యార్థినులును ఆకతాయిలు అల్లరి చేస్తున్నారనే విషయం తెలుసుకున్న ఎస్.ఐ భరత్ కుమార్ రాజు సిబ్బంది తో కళాశాల కు వెళ్లి చూసారు. అయితే అక్కడ ఆకతాయిలు ఉండడం చూసి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ రోజుల్లో ప్రతీ ఒక్కరూ కష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలు చేరుకుంటారనీ,ఈ విధంగా ఆకతాయి గా తిరిగిన వారికి అసలు భవిష్యత్తు ఉండదనీ చెప్పారు. ప్రతీ తల్లి తండ్రి తమ పిల్లలు కష్టపడి చదివి మంచి భవిష్యత్ ఏర్పాటు చేసుకోవాలనీ కోరుకుంటారే తప్ప ఈ విధంగా ఉండాలనీ ఎవరూ కోరుకోరనీ అన్నారు. తల్లితండ్రులు ఆశయాలు నెరవేర్చాలనీ అన్నారు. ఇక మీదట ఇలాంటి వేషాలు వెస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# వెంపాడకు సన్మానం

భీమునిపట్నం : విజయభాను న్యూస్ ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా విశాఖపట్నం జిల్లా నవ చైతన్య కళానాట్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విశాఖపట్నం, మద్దిలపాలెం లో గల కళాభారతి ఆడిటోరియంలో ఉత్తరాంధ్ర కళాకారుల ప్రదర్శనలో సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఛాన్స్ లర్ ఆచార్య జి.యస్.ఎన్.రాజు చేతులు మీదుగా నన్ను సన్మానించినట్లు వెంపాడ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అనంతరం సాలువ , మెమోంటో , సన్మానపత్రం అందజేశారనీ అన్నారు. సమాజంలో వెంపాడ శ్రీనివాసరెడ్డి లాంటి మహనీయులు అరదుగా ఉంటారని, ఉత్తరాంధ్ర కళాకారుల సంక్షేమ సంఘంలో సంయుక్త కార్యదర్శి పదవి కల్పించి ఈ రోజు నుంచి సంఘంలో ఒక కుటుంబ సభ్యునిగా ఉండాలని ఆయన అన్నారనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారులు కొణతల రాజు , పిల్లి వీర్రాజు , సరగడ చిన్నరెడ్డి పాల్గొన్నారనీ చెప్పారు.

# మెగా ఉచిత వైద్య శిబిరం




భీమునిపట్నం : విజయభాను న్యూస్. ఎస్ ఓ ఎస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం భీమిలి తోటవీధిలో మెగా ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి 2 వరకు జరగిన ఈ మెడికల్ క్యాంపు లో విశాఖపట్నం మెడి కోవర్ హాస్పటల్ పెద్ద డాక్టర్లు వచ్చి బి.పి,షుగర్,ఈసిజి టెస్టులు ఉచితంగా చేసారు.

చిన్నపిల్లల సమస్యలు, పెద్దవారికి వివిధ రకాల సమస్యలకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి తనిఖీలు చేసి ఉచితంగామందులు పంపిణీ చేసారు. మెడికోవర్ వైద్యులు డాక్టర్ ప్రసన్న(గైనిక్), డాక్టర్ సాయి(జి.ఎం), డాక్టర్ తరుణ్(జి.ఎం) 206 మందికి తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలోమెడికల్ క్యాంపు టీం ఇంఛార్జ్ కిరణ్ కుమార్,కుటుంబ బలోపేతం కార్యక్రమం ఎస్ ఒఎస్ ఆర్గనైజెషన్ మేనేజర్ ఎ స్.దుర్గరాజు ,వి.సత్యనారాయణ,అనన్యదాసు,సరళ,అప్పలకొండ,చిట్టివలస జ్యూట్ మిల్ కాంగ్రెస్ కార్మికసంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ దల్లి అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి




భీమునిపట్నం : విజయభాను న్యూస్ స్వాతంత్రం ఆంధ్రరాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమం భీమిలి, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. భీమునిపట్నం ఎంపిపి వాసురాజు, ఎమ్డీఓ వెంకట రమణ ప్రకాశం పంతులు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకాశం పంతులు బ్రిటిష్ పాలనలో మద్రాస్ ప్రెసిడెన్సీకి ముఖ్యమంత్రి గా చేసారని చెప్పారు.అదేవిధంగా మద్రాస్ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ విడిపోయిన తరువాత ఆంధ్ర రాష్ట్రానికి మొదట ముఖ్యమంత్రి గా పనిచేసారనీ చెప్పారు.ఆయన ఆశయ సాధన కోసం ప్రతీ ఒక్కరూ కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఆర్డీ, సర్పంచులు, ఎంపిటిసిలు అధికారులు పాల్గొన్నారు.

# పూర్ణ అధ్యక్షన సైకిల్ స్టాండ్ కు శంకుస్థాపన



పరవాడ:- అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థినీ విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాల కమిటీ పర్యవేక్షణలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పూర్ణ మరియు తిప్పల దేవన్ రెడ్డి యువసేన ఆర్థిక సహాయంతో సుమారు లక్ష యాభై వేల రూపాయలతో సైకిల్ స్టాండ్ షెడ్ నిర్మాణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పూర్ణ ఇరువురు కలిసి శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ సందర్భంగా పూర్ణ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు వారి సైకళ్లను ఆవరణలో ఎక్కడపడితే అక్కడ పెట్టడం గమనించి, పాఠశాల కమిటీ, మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణారావుగారు కోరగా ఈ కార్యక్రమం చేయడం జరిగిందని పూర్ణ అన్నారు.ముఖ్యఅతిథి 85 వార్డు కార్పొరేటర్ శ్రీమతి ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు సైకిల్స్ ఎండకు ఎండి వానకి తడిసి సైకిల్ పాడవకుండా ఈ షెడ్డు ఉపయోగపడుతుందని అలాగే స్కూల్లో ఎక్కడ పెడితే అక్కడ పెట్టకుండా ఉండేందుకు ఉపయోగపడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ బంధం అప్పలరాజు,వైస్ చైర్ పర్సన్ బేత అనిత,వ్యాపారవేత్త డాక్టర్ దుర్గాప్రసాద్,కమిటీ సభ్యులు దాసరి సత్యవేణి,బలిరెడ్డి శ్రీను, రమాదేవి, సైకియాదేవి,లోకేశ్వరి, మరియు 79,85 తిప్పల దేవన్ రెడ్డి యువసేన సభ్యులు పాల్గొన్నారు.

# మరిడిమాంబ క్రికెట్ టోర్నీలో అనకాపల్లి జర్నలిస్ట్ టీమ్ విజయం



అనకాపల్లి విజయ్ భాను న్యూస్: పట్టణంలో కోట్నీ వీధిలో వెలిసిన శ్రీ మరిడిమాంబ అమ్మవారు ఈనెల 31న పండగ మహొూత్సవ సందర్భంగా కోరుకొండ రాఘవ మిత్రమండలి ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నీ ను బుధవారం రింగ్ రోడ్ గ్రౌండ్లో ప్రారంభించారు. తొలిరోజు మ్యాచ్లో అనకాపల్లి జర్నలిస్ట్ టీం విజయం సాధించింది. అనకాపల్లి ఎస్సై సత్యనారాయణ మాచ్ ను ప్రారంభించారు. ,ఈ పోటీల్లో మొదటి బహుమతిగా 10 వేల రూపాయలు నగదు, రెండో బహుమతిగా 5 వేల రూపాయలు, మెన్స్ అఫ్ ది మ్యాచ్, మెన్స్ ఆఫ్ ది సిరీస్ కూడా బహుమతులు ఉన్నట్లు 84 వ వార్డు ఇంచార్జ్, వైఎస్ఆర్సిపి పట్టణ కార్యదర్శి కోరుకొండ రాఘవ తెలిపారు. ఎస్ ఐ ను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. తొలి మ్యాచ్లో అనకాపల్లి జర్నలిస్టుల టీం గెలవగా మేన్ ఆఫ్ ది మ్యాచ్ సతీష్ కు లభించింది. ఈ కార్యక్రమంలో. ఆలయ కమిటీ చైర్మన్ కోట్నీ శ్రీనివాసరావు. ధర్మకర్తలు. అలం ప్రసాద్, కోరుకొండ వాసు, సీతా నూకరాజు,కోటయర్ నాగరాజు, లకి దప్పు స్వప్న, కేతిరెడ్డి ప్రసాద్ పాల్గొనగా అనకాపల్లి జర్నలిస్ట్ టీం నుంచి సాయిరాం, సతీష్, వీరబాబు, సత్యనారాయణ, స్వామి, అజయ్ ప్రసాద్, బోసు తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## ముందడుగు

'స్త్రీకి కూడా శరీరం వుంది, దానికి వ్యాయామం ఇవ్వాలి. ఆమెకి మెదడు వుంది, దానికి జ్ఞానం ఇవ్వాలి...' అనే సంగతి గుర్తించని ఈ దేశానికి, నేను రాసే ఈ సంగతులు అర్థమవుతాయా? అంటాడు చలం. నాగరికత హెచ్చినకొద్దీ... పనులు, ధ్యాసలు, ఆశలు ఎక్కువైన కొద్దీ... మనుషుల్ని మనుషులుగా గుర్తించడం తగ్గిపోయింది. నాటి నుంచి నేటి వరకూ స్త్రీకి ఒక వ్యక్తిత్వాన్నివ్వలేదు మన సమాజం. పురాణాలు, ధర్మశాస్త్రాలు, మనుస్మృతి, ఇతర మత గ్రంథాలన్నీ పురుషుల కోసం రాసినవే. వాటిలో వాడిన భాష కూడా చాలావరకూ ఈ ధోరణిని ప్రతిబింబించేలాగే వుంటుంది. ప్రతి వ్యక్తీ లేచినప్పటి నుంచి ఏదోక సందర్భంలో ఊతపదాలు, మూస పదాలు, మోటుహాస్యంతో కూడిన పదాలను అలవోకగా వాడుతూ వుంటారు. ఈ పదాలలో చాలావరకూ స్త్రీలను కించపరిచేవే ఎక్కువగా వుంటాయి. ఆధునిక యుగంలోనూ ఈ తరహా మూస పదాలు, బూతుపదాలు సాధారణ పదాలుగానే చలమణీ అవుతున్నాయి. స్త్రీల దుస్థితిని ప్రతిబింబింపజేస్తూ... 'దొడ్లో గేదె వుంది, ఇంట్లో నేనున్నాను ఇంటిల్లిపాదికీ' ఆ పాత్ర చేతనే పలికిస్తాడు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి తన 'అరికాళ్ల కింద మంటలు' కథలో. ఎస్సీ, ఎస్టీ మహిళల్లో అయితే... ఇదింకా ఎక్కువగా వుంటుంది. అగ్రవర్ణ మహిళలు కూడా వీరిపై మూస పదాలను ఎక్కువగానే ప్రయోగిస్తుంటారు. 'అగ్రవర్ణ స్త్రీలే... మా దళిత స్త్రీలకు మా మగోళ్ల కంటే, పెద్ద మగోళ్లు' అంటారు రచయిత్రి ఎంఎం వినోదిని. స్త్రీల వ్యక్తిత్వాన్ని, అస్తిత్వాన్ని ఈ ఆధునిక యుగంలోనూ రంపపుకోతకు గురిచేస్తున్నది ఈ మూస పదాల బూతుపురాణం.

స్త్రీల పట్ల వాడకూడని పదాలు, కించపరిచే మాటలు ఇకపై చెల్లవంటూ... కోర్టుల్లో కేసుల విచారణలోనూ, తీర్పుల్లోనూ మహిళల పట్ల లింగవివక్ష లేకుండా చూసే విషయంలో సర్వోన్నత న్యాయస్థానం కీలకమైన ముందడుగు వేసింది. 'వేశ్య, పతిత, ఎఫైర్, హౌస్‌వైఫ్, ట్రాన్‌సెక్సువల్, వ్యభిచారం వంటి 40 పదాలను తొలగిస్తూ కొత్త హ్యాండ్‌బుక్‌ను విడుదల చేసింది. ఇకపై తీర్పుల్లో మహిళల పట్ల సున్నితమైన పదజాలాన్ని మాత్రమే వాడాలని ఆదేశించింది. 'కోర్టు తీర్పుల్లో మహిళలపై వివక్ష చూపే విధంగా ఉపయోగించే పదాలు సరైనవి కావు. అయితే, గత తీర్పులను విమర్శించడం ఈ పుస్తకం ఉద్దేశం కాదు. మూస పదాలు ఎలా ఆచరణలో వున్నాయో చెప్పేందుకే' అని చీఫ్ జస్టిస్ వ్యాఖ్యానించారు. తీర్పుల్లో వాడే కొన్ని పదాలు లింగ వివక్షకు దారితీస్తున్నాయి. వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగిస్తున్నాయి. ఈ మూస పదాల వల్ల తెలియకుండానే స్త్రీలకు అన్యాయం జరుగుతోందని తాజా తీర్పులో వెల్లడించారు. 'నేను రాసే ఈ సంగతులు అర్థమవుతాయా?' అని 98 ఏళ్ల క్రితం చలం అన్న మాటలు... గుర్తుకొస్తాయి. అంతేకాదు, ఊతపదాల పేరుతో సమాజంలోని అన్నిరంగాల్లోనూ నిరాఘాటంగా చెలామణి అవుతోన్న పురుషాధిక్య భావజాలానికి ఈ తీర్పు ఓ హెచ్చరిక. 'స్త్రీల కన్నీటి కథలకు కారణాలు తెలుసు. వారి తరపున వకాల్తాకే నిర్ణయించుకున్నా. స్త్రీలు మేలుకోవాలి, ఎదిరించాలి, తిరగబడాలి' అంటాడు గురజాడ.

కుటుంబంలోనైనా, సమాజంలోనైనా స్త్రీని గౌరవించలేని ఏ వ్యవస్థ అయినా అమానవీయమైనదే. సమాజ వికాసంలో పురుషునికన్నా... ముఖ్యమైన పాత్ర పోషించిన స్త్రీని, నవ నాగరికత పేరిట, కార్పొరేట్ విష సంస్కృతి ముసుగులో, సాంప్రదాయం పేరుతో ఛాందస మత మౌఢ్య సంస్కృతిలో బందీగా మార్చేశారు. మూసపదాలు, ఊతపదాలతో గాయపరుస్తున్నారు. ఈ విష సంస్కృతి నుంచి బయటపడేందుకు, సాంప్రదాయ సంకెళ్లు తెంచుకునేందుకు ఈ తాజా తీర్పు తొలి అడుగు కావాలి. చీకటిని తిట్టుకుంటూ కూర్చునేకంటే, చిరుదీపమొకటి వెలిగించాలి. అది ఇల్లైనా, సమాజమైనా... మనిషిని మనిషిగా గౌరవించాలి. పిలుపు పేరుతోనో, మాటల పేరుతోనో పురుషస్వామ్య అణచివేతల రంపపుకోతలు పూర్తిగా అంతమయ్యే రోజొకటి రావాలి. చట్టాల్లోనే కాదు... మనుషుల భావనల్లోనూ, సమాజంలోని భావజాలంలోనూ మార్పు రావాలి. స్త్రీ పురుష అసమానతలు లేని సమాజాన్ని నిర్మించుకోవాలి. చైతన్యం... స్వేదంతో తడవాలి, రక్తంలో మరగాలి. ఈ వ్యవస్థను మరమ్మతు చేయాలి.

# గంజాయి లభ్యత, రవాణా, వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలి.

## డి. ఎడిక్షన్ సెంటర్లను నిర్వహించాలి.

## చెక్ పోస్ట్ వద్ద నిఘా పెంచాలి.



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** జిల్లాలో గంజాయి లభించకుండా గట్టి చర్యలకు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున స్పెషల్ ఎన్ పోర్చు మెంట్ బోర్డు అధికారులకు సూచించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టరు సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించి అధికారులకు సూచనలు గావించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి , డ్రగ్స్ లబించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. కాలేజీలు, స్కూళ్లలో కమిటీలను ఏర్పాటు చేసి విద్యార్థులకు దీని వలన కలిగే దుష్పరిణామాలను తెలిపి, అవగాహన కలిగించాలన్నారు. ఆ కమిటీలలో ఈ విషయంపై శిక్షణ పొందిన ఎన్ .జి. ఓ ల ప్రతి నిధులను మెంబర్లుగా ఉంచి వారి సేవలను వినియోగించుకోవాలన్నారు. దీని వినియోగానికి అలవాటు పడ్డ వ్యక్తులకు డి- అడిక్షన్ కేంద్రాలలో చేర్పించి, వారిని వాటి వినియోగించడం నుండి దూరం చేయడానికి కృషి చేయాలన్నారు.

జిల్లాలో గంజాయి రవాణా కాకుండా అన్ని మార్గాలలో అవసరమైన స్థాయిలో నిఘా పెంచాలన్నారు. దానికి అవసరమైన మౌళిక సదుపాయాలు కొరకు అవసయమైన నిధులను మంజూరు గావిస్తానని తెలిపారు. ఆర్.టి.సి, ప్రైవేటు, బస్సులు, ఇతర వాహనములు, పలు కొరియర్ సంస్థలు మొదలైన వాటి ద్వారా రవాణాను శతశాతం అరిట్టాడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా ఫలితం కనపడాలని అధికారులను హెచ్చరించారు.

ఆయా సంస్థల ప్రతినిధులు యూనియన్ ప్రతినిధులతో సమావేశాలను నిర్వహించి వారికి స్పష్టమైన సూచనలు తెలియ చేయాలన్నారు. దీని రవాణాకు సహకరిస్తే కలిగే పరిణామాలను తెలియజేయాలన్నారు. ఆన్ లైన్ మార్కెటింగ్ ద్వారా వీటి రవాణా అరిక ట్టడానికి అవసరమైన చర్యలను చేపట్టాలన్నారు. అదే విధంగా షిపింగ్ బోట్స్ ద్వారా రవాణా అరికట్టడానికి మైరైన్ పోలీస్, ఫిషరీస్ శాఖలతో చర్చించి వారి సహకాన్ని పొందాలన్నారు.

జిల్లాలో పలు ప్రాంతాలలో రాత్రి వేళల్లో గంజాయికి అలవాటు పడిన వారు దీనిని చేవించడం జరుగుతోందని, దీని వల్ల పలు సమస్యలు ఎదురవుతున్నట్లు వార్తలు వస్తున్నాయని , కావున జిల్లాలో సదరు ప్రాంతాలను పరిశీలించి అక్కడ లైటింగ్ ఏర్పాటు, పెట్రోలింగ్ పెంచడం వంటి చర్యలు చేపట్టాలన్నారు.

ఈ సమావేశంలో ఎస్.ఇ.బి, అడిషనల్ ఎస్పీ బి. శ్రీనివాసరావు, ఎ డి సి పి క్రైమ్ డి.గంగాధరం , ఆర్డీవో హుస్సేన్ సహేబ్, డీఈవో చంద్రకళ , ఎ.డి (డ్రగ్ కంట్రోల్ ) కె.జి.హెచ్ సైకియాట్రి నిపుణులు , డీఎంహెచ్వో పి జగదీశ్వరరావు , కస్టమ్స్ , ఫారెస్ట్ , మెంటల్ కేర్ , పలు ఎన్.జి.ఓ ప్రతి నిధులు , నేవీ అధికారులు హాజరైయ్యారు .

## గడపగడపకు మన ప్రభుత్వంలో వచ్చిన పనులను అప్ లోడ్ చేయాలి

### సమావేశానికి హాజరుకాని ఎంపిడిఓలకు షోకాజ్ నోటీసులు

### జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సిపిఓకు ఆదేశాలు



శ్రీకాకుళం,: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన పనులకు సంబంధించి ప్రతిపాదనలను తక్షణమే అప్ లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఎంపిడిఓలను ఆదేశించారు. గడపగడపకు మన ప్రభుత్వంలో వచ్చిన పనులపై ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్ లతో బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మండలాల వారీగా సమీక్షిస్తూ ప్రస్తుతం జరుగుతున్న గడపగడపకులో పనులు ఉంటే ఉన్నాయని లేకపోతే ప్రస్తుతం పనులు ఏమీ లేవని అప్ లోడ్ చేయాలని చెప్పారు. మండలాల్లో జరుగుతున్న గడపగడపకు మన ప్రభుత్వంనకు సంబంధించి వచ్చిన పనుల ఎస్టిమేషన్స్ అప్ లోడ్ చేయాలని ఆదేశించారు. జూలై కంటే ముందు ఉన్న పనులను తక్షణమే అప్ లోడ్ చేయాలన్నారు. నరసన్నపేట, ఆమదాలవలస, సోంపేట, టెక్కలి, జలుమూరు ఎంపిడిఓలు సమావేశానికి హాజరు కాకపోవడంపై షోకాజ్ నోటీసులు జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని సిపిఓను ఆదేశించారు ఎస్టిమేషన్స్ ఎన్ని పెండింగ్ లో ఉన్నది అడిగి తెలుసుకుని మండలాల వారీగా ఎస్టిమేషన్స్ పెండింగ్ లో ఉన్న మండలాలు తక్షణమే అప్ లోడ్ చేయాలని ఆదేశించారు. మంజూరు చేసిన పనులను త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని, నిధులకు కొరత లేదన్నారు. ప్రారంభించిన పనులను తక్షణమే పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పంచాయతీ రాజ్, ఆర్డబ్ల్యుఎస్, మున్సిపాలిటీలలో తక్షణమే పనులు ప్రారంభించి బిల్లులు వెంటనే అప్ లోడ్ చేయాలన్నారు. గుత్తేదారులతో సమావేశం ఏర్పాటు చేసి పనులు ప్రారంభించి పూర్తి చేయాలని, నిధులకు కొరత లేదని చెప్పాలన్నారు. పనులు జరుగుతున్నట్లు ఫోటో తీసి అప్ లోడ్ చేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్ఈ మూర్తి, సిపిఓ లక్ష్మీ ప్రసన్న, ఈఈలు, పంచాయతీ రాజ్, ఆర్డబ్ల్యుఎస్ ఎఈలు, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కవి సమయం

## శ్రీకృష్ణ దేవుడు

అదిగదిగో దేవుడు
శ్రీ కృష్ణ దేవుడు
సర్వ మంతా వున్నాడు.
పరమాత్ముని తలచుటయే పుణ్యమైన దినమని
ప్రతి దినము పరమావధి మీరని
గోవర్ధన గిరినెత్తి-భయమన్నది పోగొట్టి
వెతలు మోత మోసిరి- ప్రజలు చెంత నిలిచిరి
క్షణమంత పిలుపుతో - సాయమెంతో వుందని
శ్రమజీవన సాధనలో - సర్వజీవ రాసివి;
కొరత లేని జీవనం - ప్రతి ప్రాణికి ప్రాప్తివి.
పాడగా పాటయందు
ఆడగా ఆటయందు
పనిపాటులు యందును
చిత్తం, శరణం అనుకొని
లేనిదంటు తీరెను
ఉన్నదెంతో యిచ్చెను
విశ్వమంత దివ్యము - దివ్యమైన తేజము.


కవిత రచన :
మజ్జి శ్యామసుందరరావు

# పంచాంగం

a **మేషం :** ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. మీ ఆలోచనలు, పథకాలు కార్యరూపం దాల్చుతాయి. భాగస్వామిక చర్చలు, సంప్రదింపులకు అనుకూలం. స్త్రీలకు ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం. శాస్త్ర రంగాల వారికి పరిశోధనలు, ప్రయోగాలకు మంచి గుర్తింపు లభిస్తుంది. మీ వాహనం, విలువైన వస్తువులు జాగ్రత్త. గృహ నిర్మాణాలు, మరమ్మతులకు అనుకూలం. b **వృషభం :** విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు.ఉద్యోగస్తులు సమర్థంగా పనిచేసి పై అధికారులను మెప్పిస్తారు. ఒక కార్యం నిమిత్తం ఆకస్మికంగా ప్రయాణం చేస్తారు. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కానవస్తుంది. c **మిథునం** :ఎల్ఐసి, పోస్టల్ ఏజెంట్లు, రిప్రజెంటేటివ్‌లు టార్గెట్‌లను అధిగమిస్తారు. ఉపాధ్యాయులకు, రిప్రజెంటేటివ్‌లకు సదవకాశాలు లభిస్తాయి. స్త్రీలకు ఆరోగ్యంలో అధికమైన జాగ్రత్త అవసరం. d **కర్కాటకం :** స్థిరాస్తుల అమ్మకానికై చేయు యత్నాలు వాయిదాపడతాయి. ఉద్యోగస్తులకు అధికారులతో అప్రమత్తత అవసరం. విద్యార్థులకు మిత్రబృందాలు, వ్యాపకాలు అధికం కాగలవు. దీర్ఘ కాలికంగా వేధిస్తున్న సమస్యలు పరిష్కాం౯మవుతాయి. అంతగా పరిచయం లేని వ్యక్తులకు దూరంగా ఉండటం మంచిది. e **సింహం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కాన వస్తుంది. f **కన్య :** ధనసహాయం చేసే విషయంలో అప్రమత్తత అవసరం. దైవ దర్శనాలలో ఇబ్బందులను ఎదుర్కొంటారు. ఉద్యోగస్తులు ఓర్పు, నేర్పుతో విజ యాన్ని సాధించగలరు. మధ్యవర్తిత్వం వహించటం వల్ల మాటపడక తప్పదు. మార్కెటింగ్ రంగాల్లో ఒత్తిడి పెరుగుతుంది. పాత వస్తువుల వల్ల ఇబ్బం దులు తలెత్తుతాయి. g **తుల** : నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాల్లో నిల దొక్కు కుంటారు. జీవితభాగస్వామి ద్వారా ఆర్థిక లాభం పొందుతారు. చిన్నతరహా పరిశ్రమలు, చిరు వ్యాపారులకు సామాన్యం. ప్రముఖుల కలయిక వల్ల ఆశించిన ఫలితం ఉంటుంది. నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు, బిల్డర్లకు స్వీయ పర్యవేక్షణ ముఖ్యం. h **వృశ్చికం :** దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ ఆంతరంగిక విషయాలు గోప్యంగా ఉంచండి. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారి తీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. కొంతమంది మీ నుంచి ధనం లేక ఇతర్రతా సహాయం అర్థిస్తారు. ముఖ్యుల రాకపోకలు అధికం అవుతాయి. i **ధనుస్సు :** వృత్తి వ్యాపారులకు అన్నివిధాలా అనుకూలం. కీలకమైన సమస్యలు పరిష్కారం కావటంతో మీలో కొత్త ఉత్సాహం కనిపిస్తుంది. కుటుంబీకుల కోరికలు తీరుస్తారు. చేపట్టిన పనులు ఆశించినంత చురుకుగా సాగవు. భాగస్వామిక చర్చల్లో మీ అభిప్రాయాలకు ఆమోదం లభిస్తుంది. ఉద్యో గస్తులు కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. j **మకరం :** ఒక కార్యం నిమిత్తం ప్రయా ణం చేస్తారు. పత్రికా సంస్థలలోని వారికి ఊహించని సమస్యలెదురవుతాయి. దంప తుల మధ్య చిన్న చిన్న కలహాలు, చికాకులు తప్పవు. కోర్టు వ్యవహారాల్లో కొంత పురోగతి కనిపిస్తుంది. డాక్టర్లు అరుదైన చికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు. సభలు, సమావేశాల్లో చురుకుగా పాల్గొంటారు. k **కుంభం :** దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ ఆంతరంగిక విషయాలు గోప్యంగా ఉంచండి. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారితీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. L **మీనం :** విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అను కూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కానవస్తుంది. అయినవారితో ఉల్లాసంగా గడుపుతారు. నిరుద్యోగులకు ఉపాధి పథకాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఆలయాలను సందర్శిస్తారు.

# భక్తి వాఙ్మయంలో భజగోవిందం

## సంకీర్తన



క్షణక్షణం మానవ జాతి యావత్తు అశాంతితో కొట్టుమిట్టాడు తోంది. స్వార్థము, మోహము, తృష్ణ, డంభములతో నడిచే మానవ జాతికి సత్సాంగత్యము, భగవద్భక్తి మొదలైన ఆర్షధర్మములే ప్రశాంతిని చేకూర్చగలవు. శంకర భగవత్పాదులు అందించిన భజగోవింద స్తుతి భక్తివాఙ్మయములో అద్వితీయ మైనది. ధార్మిక ప్రబోధము, విష్ణుభక్తి ప్రేరకముఅగు ఈ స్తుతికిగల భక్తిప్రచారము అనన్యసామాన్యము. దీనికి మోహముద్గరమని నామాంతరము కలదు. ఈ స్తుతి పండితులనుండి పామరుల వరకూ జీవన సత్యాన్ని బోధిస్తుంది. దీనిని పఠించుటవలన, అందలి సారాన్ని కొంతలోకొంతైనా ఆచరించిన జన్మ ధన్యత నొందగలదు. ఈ స్తుతి ఛందములోను, పద్య శిల్పము లోను, భావగౌరవములోను పదముల పొందికలోను అత్యంత రమణీయమైనది. శంకర భగవత్పాదులు అపర శంకరా వతారం కారణజన్ములు. 32 సంవత్సరములే జీవించినా శంకరులు ఆనాటి సాంఘీక, సామాజిక, ఆధ్యాత్మిక స్థితిగతులను సమూలాగ్రంగా సమీక్షించి, భారత జాతిని ఒక్క త్రాటిపై తెచ్చిన ఘనత వీరికే చెందుతుంది. హిందూ మతస్థులందరికీ, అన్ని శాఖలవారికి అనువుగా స్తోత్రరాజాలను రచించిన ఘనత ప్రప్రథమంగా శంకరులకే చెందుతుంది. మూడు పర్యాయములు భారతదేశ సంపూర్ణ యాత్రచేసి అద్వైత తత్వాన్ని ప్రతిపాదించిన మహనీయులు శంకర భగవత్పాదులు. నాలుగు చెరగులా నాలుగు శంకరాచార్య పీఠాలను స్థాపించి ఆధ్యాత్మిక ప్రతిపత్తి కల్పించిన పరివ్రాజకుడు శ్రీ శంకర భగవత్పాదులు. ఒక విధంగా భారతీయ జీవన విధానాన్ని దిశానిర్దేశనం చేసిన మహోన్నత వ్యక్తి శ్రీ శంకర భగవత్పాదులు. అసలు భజగోవింద స్తుతి రచించటానికి ఒక వృద్ధుడు కారణభూతుడు. వ్యాకరణ పాఠాన్ని వల్లెవేయటంవలన ప్రయోజనం లేదని గోవిందుని భజించుటయే ముఖ్యమని, అదే మానవ జన్మకు తరుణోపాయమని భజగోవింద స్తుతిని అందించారు శంకర భగవత్పాదులు. మొదటి శ్లోకంలో భజగోవింద మూడుసార్లు అనటంలో పునరుక్తి దోషములేదనుట భాషాకోవిదుల అభిప్రాయం. విషయము అర్థమైన రీతిలో నివేదిం చటంలో ఔచిత్యమున్నది. మొదటిసారి దీక్షాగురువులు గోవింద పాదులవారిని స్మరించటం, రెండవసారి శ్రీమన్నారాయణు ని మూడవసారి తత్వభూతమైన స్వరూపాన్ని స్మరించారని వ్యాఖ్యానకారుల అభిప్రాయం. ఇక శ్లోకాల విషయానికి వస్తే అత్యాశలేని జీవితం. ఉన్నదానిలో సంతృప్తి చెందటం (మూఢ జహిహిధనాగమతృష్ణా), మోహాన్ని వదలి మానవీయంగా బ్రతుకుట నేర్చుకోవాలి (నారిస్తన భరనాభిదేశం), స్వజనులు వ్యవహరించేరీతి. మరణ సమయంలో భార్యాపిల్లలు భీతి చెందుట (యావత్పవనో నిరసతిదేహే) వివరిస్తారు. అలాగే యదార్థతత్వాన్ని చింతన చేయాలి (కాతేకాన్తాకస్తే పుత్రః), నిస్సంగత్వం, నిర్మోహత్వం, నిశ్చలతత్వం, జీవనముక్తి హేతువు (సత్సంగత్వే నిస్సంగత్వం)గా స్వీకరిస్తూ ధనవన గర్వాన్ని వీడి శాశ్వతతత్వాన్ని పొందే ప్రయత్నం చేయాలి. (మాకురువన గర్వ) సజ్జన సాంగత్యంతోనే జన్మతరిస్తుంది (కాతేకాన్తాధనగత చింతా), బహుకృత వేషాలతో జీవిత వలయంలో చిక్కుకొని సత్యదర్శనాన్ని పొందటంలేదు. (జటిలో ముండిలుంచితకేశః) అంతేగాదు జ్ఞానవిహీనునికి గంగాసాగర గమనం ముక్తినందించదని (కురుతే గంగాసాగర గమనం) సర్వసంగ పరిత్యాగికి సుఖానుభూతి సులభతరమని (యోగరతోవా భోగరతోవా), నేనెవరినని ప్రశ్నించుకుంటే సంసార స్వప్నతుల్యమని (కస్త్వంకో అహంకుత ఆయాతః) బోధపడుతుంది. సమచిత్తుడవైతేనే పరమాత్మను పొందగలవు. (త్వయిమయిచ అన్యత్రైకోవిష్ణుః), సమత్వభావన అలవరచుకుంటే (శత్రేమిత్రౌపుత్రౌ బంన్ధౌ), సో అహం తత్వాన్ని గ్రహించగలవు. (కామక్రోధంలోభం మోహం). అలాగే ధనార్జనవల్ల శుఖము కలుగదు (అర్థమనర్థం భావయ నిత్యం). చివరగా ప్రాణాయామం, జపతపాదుల వలన సత్యతత్వం బోధ పడుతుంది.

(ప్రాణాయామం ప్రత్యాహారం). గురువు నాశ్రయించిన వానికి పరమాత్మ దర్శనం సులభతరవౌతుంది. ఎటొచ్చి వాటిని ఆచర ణాత్మకం చేసినపుడే వ్యక్తి సంస్కారవంతుడు కాగలడు. ఇటువంటి జీవన సత్యగుళికలని మనిషి పుట్టుకనుండి మరణం వరకు అన్ని ఇతివృత్తాలని తత్వవిచారంగా 32 ఏళ్ళ వయస్సులో రచించటం శంకర భగవద్పాదులు, అవతార పురుషులని ఘంటాపథంగా చెప్పవచ్చు.

ఈ శ్లోకాలను పఠించాలి, అందలి మూలార్థాన్ని స్వీకరించి మానవ జన్మను సార్థకత చేసుకోవాలి. శంకరాచార్య రచించిన కనకధారా స్తవము, సౌందర్య లహరి ఇత్యాది రచనలు దైనం దినంగా దీక్షాతత్పరులుగా పఠిస్తే సర్వకార్యసిద్ధి లభించుటయే గాక, మానసిక ప్రశాంతత సిద్ధించగలదు.

# దైవారాధనలో రాగి పాత్ర

ఈ రోజుల్లో కూడా పూజాది కార్యక్రమాలకి వెండి, బంగారు పాత్రలు ఉపయోగించే వారు లేకపోలేదు. అయితే ఒకప్పటికంటే ఇప్పుడు అలాంటివారి సంఖ్య తగ్గిందనే చెప్పాలి. ఇక మధ్యతరగతి వారు కూడా ఇత్తడి - రాగి పాత్రలను వాడటం చాలావరకు తగ్గించారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఎవరి ఇంట్లో చూసినా స్టీలు పాత్రలే దర్శనమిస్తున్నాయి. పూజకి ఉపయోగించే అన్ని రకాల పాత్రలు నేడు స్టీలులోనే కనిపిస్తున్నాయి. నగిషీ కారణంగా స్టీలు ... ఇనుము అనే భావన కలగనీయదు. ఈ కారణంగానే దీని వాడకం అంతకంతకూ పెరుగుతూపోతోంది.అయితే ఇటు ఆరోగ్యపరంగాను ... అటు ఆధ్యాత్మిక పరంగాను స్టీలు పాత్రలను వాడకూడదని శాస్త్రం చెబుతోంది.

**పూజలకు స్టీల్ పనికిరాదు:**

స్తోమత వుంటే వెండి - బంగారం, లేదంటే ఇత్తడి - రాగి పాత్రలను వాడటమే అన్ని విధాలా మంచిదని చెబుతోంది. స్టీలు ( ఇనుము) శని సంబంధమైన లోహం కనుక, దానికి బదులుగా ఇతరలోహాలతో చేసిన పాత్రలను మాత్రమే పూజకు వాడాలనీ, అప్పుడే ఎలాంటి దోషాలు లేని పరిపూర్ణమైన ఫలితాలను పొందవచ్చని స్పష్టం చేస్తోంది.

**రాగితో ఆరోగ్యం బోలెడు:**

గతంలో రాగి చెంబు, రాగి బిందె, రాగి గ్లాసు, రాగి ప్లేటు ఇలా ఎక్కువగా రాగి వస్తువులనే వాడే వారు. కాని నేడు ఫ్యాషన్ ఎక్కువయ్యి ప్లాస్టిక్ వచ్చిపడింది. దాంతో రాగి పాత్రల వాడకం బాగా తగ్గిపోయింది. నీళ్ళు తాగాలంటే ప్లాస్టిక్ బాటిల్స్, లంచ్ బాక్సులు కూడా ప్లాస్టికే. నేటి ఇళ్ళు మొత్తం ప్లాస్టిక్ సామానుల మయమైపోయాయి. అయితే రాగి పాత్రలు వాడడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.

రాగిలో యాంటి బ్యాక్టీరియల్ నేచర్ ఉంటుంది. రాగితో చేసిన పాత్రలలో సూక్ష్మ క్రిములు చేరే అవకాశం ఉండదు. కాబట్టి ఇందులో నిల్వచేసే పదార్థాలు చెడిపోయే అవకాశాలు చాలా తక్కువ.

మనకి వచ్చే చాలా రోగాలకి నీటి కాలుష్యం ముఖ్యమైన కారణం. రాగి పాత్రలలో నీళ్ళు ఉంచితే అందులో క్రిములు చేరే అవకాశం చాలా అరుదు. అందుకే పాత రోజుల్లో రాగి బిందెలు వాడేవారు.

చెవులు కుట్టినప్పుడు కూడా చిన్న పిల్లలకి కొన్ని చోట్ల మొదటిసారి రాగి తీగలు చుడతారు. ఎందుకంటే పుండు పడకుండా ఉండటానికి. రాగికి వున్న ఆంటి బ్యాక్టీరియల్ లక్షణం పిల్లలకు ఆ ప్రమాదం రాకుండా చేస్తుంది.



గతంలో నీళ్ళు వేడి చేసుకోవడానికి రాగితో చేసిన బాయిలర్లు వాడే వాళ్ళు. ఇందులో వేడి చేసిన నీరు వాడడం వల్ల చర్మ సంబంధిత రోగాలు కూడా తగ్గేవని రుజువు చెయ్యబడ్డాయి.

రాగి చెంబులో రాత్రి నీరు వుంచి పగలు నిద్ర లేవగానే తాగితే చాలా చాలా మంచిది. అలా తాగితే కడు పులో వున్న చెడు అంతా మూత్రం ద్వారా బయటకి వచ్చేస్తుందట. ఈ అలవాటు వల్ల గ్యాస్, కిడ్నీ, లివర్ సమస్యలు కూడా తగ్గిపోతాయి.

బ్రిటిష్‌కి చెందిన ఒక యూనివర్సిటీ వాళ్ళు కూడా రాగిపాత్రలలో ఉంచిన నీటిపై పరిశోధన జరిపి పైన పేర్కొన్న విషయాలు నిజమని నిరూపించారు.

**పరగడుపున రాగి పాత్రలో నీళ్లు:**


రాత్రి రాగి చెంబులో మంచి నీళ్ళు వుంచి పరగడుపున తాగితే హాయిగా జీవించవచ్చు. రాత్రి నిద్ర పోయేముందు అర లీటర్ నుండి లీటర్ ఉండే రాగి చెంబు నిండా మంచినీళ్ళు పోసి మంచం పక్కనే పెట్టుకోవాలి ఉదయం నిద్ర లేచి లేవగానే రెండు సార్లు పుక్కిలించి ఊసి ఆ రాగి చెంబులోని నీళ్ల తాగాలి . దీనివల్ల 15 నిమిషాల నుండి అర గంటలోపు సుఖ విరోచనం అవుతుంది. గ్యాస్, కడుపుబ్బరము, కడుపులో మంట, మలబద్ధకం, తేపులు, మొదలైన బాధలన్నీ ఈ అలవాటుతో ఎటువంటి ఔషదాలు వాడే పని లేకుండా పూర్తిగా తగ్గిపోతాయి. మలబద్ధకం అనేది అన్ని వ్యాధుల్ని కలిగించడానికి మూలకారణం కాబట్టి ఈ అలవాటు తో మలబద్ధకం నివారించుకుంటే హాయిగా జీవించవచ్చు.

**ఘనమైన రాగి చరిత్ర:**

ఇక రాగి చెంబులో నీళ్ళే ఎందుకు తాగాలి వేరేవి ఉన్నాయి కదా అని కొందరికి సందేహం రావచ్చు . రాగి గురించి వరాహ పురాణంలో వివరంగా ఉంది ఈ రాగి ఏడువేల యుగాల క్రితమే విష్ణు మాయ కారణంగా పుట్టింది .

# యోగాతో అనునిత్యం ఆరోగ్యం

తరుచుగా అనారోగ్యాలకు గురయ్యే మహిళలు నిత్యం యోగా చేయడం మూలంగా అరోగ్యం కుదుటపడుతుందని వైద్యులు సూచిస్తున్నారు. వివిధ రకాల యోగాసనాల మూలంగా శరీరం, వమనసు రెండు కూడా ప్రశాంతంగా ఉంటాయని వారంటున్నారు. మానసిక ఒత్తిడిని అధిగమించడానికి యోగా ఎంతోగానో ఉపయోగపడుతుందని, మహిళలు ఇంటి పట్టునే ఉండి ప్రతిరోజు ఈ యోగాను చేయడం మూలంగా అన్ని రకాల సమస్యలు పరిష్కారమవుతాయని వారంటున్నారు. యోగాలో భాగంగా ప్రాణాయామం గురించి ఈ వారం తెలుసుకుందాం.



ప్రాణం + ఆయామం = ప్రాణాయామం. ప్రాణమంటే జీవన శక్తి. ఆయామం అంటే విస్తరింపచేయుట లేక నియంత్రించి ఉంచుట అని అర్థం. పతంజలి మహర్షి ప్రసాదించిన యోగ సూత్ర ప్రకారం శ్వాస, ప్రశ్వాసల్ని నియంత్రించి ఉంచడమే ప్రాణాయామం అని నిర్ధారించడం జరిగింది. లోనికి పీల్చే గాలిని శ్వాస అని, బయటికి వదిలే గాలిని ప్రశ్వాస అని అంటారు. శ్వాస ప్రశ్వాసల్ని నియంత్రించడం, క్రమబద్ధం చేయడం ద్వారా అంతర్గత సూక్ష్మప్రాణాన్ని కూడా అదుపులో ఉంచవచ్చు.

**నియమబద్ధంగా**

నాడీమండలం, రక్త ప్రసార ధమనులు, జీర్ణకోశం, మూత్రకోశం మొదలుగా గల వాటన్నిటి యందు ప్రాణం సంచరిస్తూ ఉంటుంది. ప్రాణాయామం వల్ల వాటన్నింటికి శక్తి, రక్షణ కల్పిస్తాయి. కనుకనే ప్రాణాయామేన యుక్తేన సర్వరోగ క్షయ భవేత్'' అంటే ప్రాణాయామం నియమబద్ధంగా ఆచరిస్తే సర్వరోగాలు హరించిపోతాయి అను సూత్రం ప్రచలితం అయింది. ప్రాణానికి ప్రాణ, అపాన, సమాన, ఉదాన, వ్యానమను 5 రూపాలు ఉన్నాయి. ప్రాణానికి స్థానం హృద యం. అపానానికి స్థానం గుదం. సమానానికి స్థానం నాభి. ఉదనానికి స్థానం కంఠం. వ్యానానికి స్థానం శరీరమంతా. శ్వాసక్రియకు ప్రాణం, విసర్జన క్రియకు అపానం, పాచన క్రియకు సమానం, కంఠశక్తికి ఉదానం, రక్తప్రసార క్రియకు వ్యానం తోడ్పడుతాయి.

**రేచకం-పూరకం**

శ్వాసను బయటకు వదిలే క్రియను రేచకం అని, లోపలకి పీల్చే క్రియను పూరకం అని, లోపల గాలిని ఉంచడాన్ని అంతర్ పూరకం అని, తిరిగి బయ టకి వదిలి ఆపి ఉంచడాన్ని బాహ్యాకుంభకం అని అంటారు. ఈ క్రియలు ప్రాణాయామానికి సాధనాలు. మెడికల్ సైన్స్ ప్రకారం రెండు ముక్కు రంధ్రాల ప్రయోజనం ఒక్కటే. కాని యోగులు ఈ రెండింటికి మధ్య గల భేదం గ్రహించారు. వారి పరిశోధన ప్రకారం కుడి ముక్కు రంధ్రాన్నుంచి నడిచే గాలి కొద్దిగా ఉష్ణం కలిగిస్తుంది. అందువల్ల దీన్ని వారు సూర్య నాడి లేక సూర్య స్వరం అని అన్నారు. అట్లే ఎడమ ముక్కు రంధ్రం ప్రభావం వల్ల చల్లని దనం అందువల్ల దాన్ని చంద్రనాడి లేక చంద్రస్వరం అని అన్నారు. ఈ రెండిటికి మధ్య సమన్వయం సాదించుటకు యోగ శాస్త్రంలో ప్రాధాన్యం ఇవ్వబడింది. హ అను అక్షరం చంద్రుడికి, ట అను అక్షరం సూర్యు డికి గుర్తుగా నిర్ధారించారు. అందువల్ల హఠ యోగం వెలువడింది. హఠ యోగ మంటే చంద్ర సూర్య నాడులకు సంబంధించిన విజ్ఞానం అన్నమాట. హఠం అనగాబలవంతం అనికాదు. ప్రాణాయామ విజ్ఞానమంతా చంద్ర, సూర్య స్వరాలకు సంబంధించినదే.


***ప్రాణాయామం వల్ల కలిగే ప్రయోజనాలు...***

1. ఊపిరితిత్తులు బాగా పనిచేస్తాయి.
2. శరీరానికి ప్రాణవాయువు బాగా లభిస్తుంది.
3 . రక్త శుద్ధి జరిగి అందలి చెడు అంతా బయటికి వెళ్లిపోతుంది.
4 . గుండెకు సత్తువ లభిస్తుంది.
5 . మెదడు చురుగ్గా పనిచేస్తుంది.
6 . ప్రేగులు, నరాలు, నాడులు శుభ్ర పడతాయి.
8 . శరీరం ఆరోగ్యంగా ఉంటుంది.
9 . ఆయుష్షు పెరుగుతుంది. ఇది అన్నిటికంటే మించిన విశేషం.

తీసుకోవలసిన జాగ్రత్తలు

- మైదానంలోగాని, తోటలోగాని, తలుపులు తెరచియున్న గదిలోగాని, కంబళీ లేక బట్ట లేక ఏదేనీ ఆసనం మీద కూర్చొని ప్రాణాయామం చేయాలి.
- గాలి విపరీతంగా వీస్తూ ఉంటే ఆ గాలి మధ్య ప్రాణాయామం చేయకూడదు.- మురికిగా ఉన్న చోట, దుర్వాసన వస్తున్న చోట, పొగ వస్తున్న చోట ప్రాణాయా మం చేయకూడదు.
- సిగరెట్టు, బీడి, చుట్టపొగ వస్తున్న చోట ప్రాణాయామం చేయకూడదు.
- పొట్ట నిండుగా ఉన్నపుడు ప్రాణాయామం చేయకూడదు.
- ప్రాణాయామం చేసే ముందు, చేసిన తరువాత కూడా ఇతర యోగాసనాలు వేయవచ్చు. అయితే చివర శవాసనం వేసి కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవాలి.

# ఈ అవగాహన అత్యవసరమే..!



మీరు మిత్రుడితో కలిసి మాట్లాడుకుంటూ రోడ్డుమీద నడుస్తున్నారు. అకస్మాత్తుగా అతడు స్పృహ తప్పాడు... ఏం చెయ్యాలి? ఇంట్లో ఒక్కసారిగా తాతయ్య మాటల్లో తడబాటు కనిపించింది... ఎందుకని? ఆ మార్పు ప్రమాదకరమా? రోడ్డు మీద వెళ్తున్నపుడు అకస్మాత్తుగా ఒకరు ఫిట్స్‌తో పడిపోయారు... మనం ఏదైనా సాయం చెయ్యగలమా? ఎప్పుడూ లేనిది కడుపు పై భాగంలో నొప్పి అసిడిటి కావచ్చని అనుకుంటాము... అది నిజంగా అసిడిటినే అయి ఉంటుందా..? లేక మరేదైనా ప్రమాదకరక స్థితి కాదు కదా? ఇలాంటి వన్నీ ఒక్కోసారి అత్యవసర పరిస్థితులకు దారి తియ్యవచ్చు. ఇలాంటి ప్రమాదకర పరిస్థితులను గుర్తించడం.., సమయానికి స్పందించడం... గురించిన వివరాలు

అత్యవసర పరిస్థితి చెప్పి రాదు; అది ఎప్పుడైనా ఎదురు కావచ్చు. ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఎవరికైనా ఏర్పడనూ వచ్చు. అలాంటి స్థితిని ఎదుర్కోవడానికి ఎల్లప్పుడు సిద్ధంగా ఉండాలి. అది మనతో ఉన్న వారు అకస్మాత్తుగా స్పృహ తప్పటం, ఎవరికైనా షాక్ కొట్టడం, ఎవరైనా పై నుంచి కింద పడిపోవడం, ఎప్పుడూ లేని విధంగా కడుపులో నొప్పి రావడం, ఇంట్లో ఎవరికైనా స్ట్రోక్ రావడం, రోడ్డు మీద ఎవరికైనా ఫిట్స్ రావడం ఇలా అత్యవసర స్థితి ఎప్పుడైనా ఏరూపంలోనైనా ఎదురు కావచ్చు. అత్యవసర పరిస్థితి ఏర్పడినపుడు ఎలా స్పందించాలనే విషయాల గురించి తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలి.


**స్పృహ తప్పితే...**

అనుకోకుండా మన వెంట ఉన్న వారు స్పృహ తప్పి పడిపోతే ముందుగా మనకు చాలా కంగారు కలుగుతుంది. ఏం చెయ్యాలో తోచదు. అయ్యో...అయ్యో... అనడం మినహా వెంటనే కర్తవ్యం బోధపడదు. అయితే స్పృహ తప్పిన వారిని ప్రమాదం నుంచి బయట పడెయ్యాలంటే అన్నింటికంటే ముందుగా మనం అలా కంగారు పడకుండా ఉండడం అవసరం. ఒకవేళ కంగారు పడినా వెంటనే సర్దుకోవాలి. పడిపోయిన వారిని గట్టిగా కుదిపి లేపి చూడాలి. గట్టిగా వారి పేరు పెట్టి పిలవాలి. ఒకవేళ వారు స్పందించగలిగితే అది ఒకింత మేలైన స్థితిగా భావించవచ్చు. ఎలాంటి స్పందన లేకపోయినట్టయితే సాయం కోసం ఎవరినైనా అభ్యర్థించడం మంచిది. గొంతు కింద చెయ్యి పెట్టి అక్కడ కొట్టుకునే నాడిని పరీక్షించి చూడాలి. ఇక్కడ కొట్టుకునే నాడిని కెరొటెడ్ పల్స్ అంటారు. అక్కడి నాడీ స్పందన కనిపించకపోతే వెంటనే కార్డియోపల్మనరీ రీ సజిటేషన్(సీపీఆర్) అనే ప్రథమ చికిత్స చెయ్యాలి. ఇందులో భాగంగా ఒకచేతి మీద మరో చేతిని ఉంచి బాధితుడి ఛాతి మధ్య భాగంలో బలంగా ఒత్తిడి కలిగించాలి. ఈ ఒత్తిడి ఎంత బలంగా ఉండాలంటే లోపలికి ఛాతిని ఒత్తినపుడు అది దాదాపు రెండు అంగుళాల మేర లోపలికి వెళ్లాలి. అలా 30 సార్లు ఒత్తిడి కలిగించిన తర్వాత బాధితుడి ముక్కు మూసేసి నోటిని నోటితో మూసేసి బలంగా రెండు సార్లు ఊపిరి తిత్తులలలోకి గాలి ఊదాలి. ఇలా వంద సార్ల వరకు ఒత్తిడి కలిగించాలి. గాలి ఊదాలి. ఇది 30:2 నిష్పత్తిలో ఉండాలి. అంటే 30 సార్లు ఒత్తిడి కలిగించి 2 సార్లు గాలి ఊదాలి. ఇలా 5 నిమిషాలు చేసి తిరిగి సీపీఆర్ కొనసాగించాలి. నాడి తిరిగి కొట్టుకోవడం మొదలు పెట్టే వరకు ఈ చికిత్స కొనసాగించాలి.

ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డిఫ్యూజర్ ఉపయోగిం చవచ్చు. ఇది ఆ సమయంలో షాక్ అవసరమా కాదా అనేది కూడా నిర్ణయిస్తుంది. దీనిలో మూడు బటన్స్ ఉంటాయి. మొదటిది ప్యాడ్స్‌ను బాధితులకు అమర్చడానికి, రెండోది హృదయస్పందనను విశ్లేషించడానికి, మూడోది షాక్ అవసరమా కాదా నిర్ణయించడానికి ఉపయోగపడతాయి. దీనిని ఎవరైనా ఉపయోగించవచ్చు. నిజానికి ఇది అన్ని పబ్లిక్ ప్లేస్‌లలో అందుబాటులో ఉండాలి. **మూర్ఛ** మూర్ఛతో బాధపడేవారిని చూసినపుడు చాలా భయం కలుగుతుంది. ఎలా స్పందించాలో కూడా అర్థం కాదు. అందరూ ఒకరకమైన ఆందోళనతో చుట్టూ చేరతారు. కొంత మంది కాస్త ధైర్యం చేసి వారి చేతికి ఏ ఇనుప వస్తువునో, తాళం చేతుల గుత్తినో అందించేందుకు ప్రయత్నం చేస్తారు. అయితే దీనితో పెద్దగా ప్రయోజనం లేదనేది నిపుణుల మాట. ఎవరికైనా మూర్ఛ వచ్చినపుడు కొన్ని ప్రత్యేకమైన జాగ్రత్తలు పాటించడం వల్ల రోగికి కొంత ఉపశమనం కలిగించిన వారిమవుతాము.

-మూర్ఛ వచ్చిన వారి చుట్టూ గుంపు కట్ట కూడదు.
-వారిని ఒడిసి పట్టుకునే ప్రయత్నం కూడా చెయ్యొద్దు, దగ్గరలో ఏవైనా గాయపరిచే వస్తువులు ఉంటే వాటిని దూరంగా తీసేస్తే చాలు
-మూర్ఛ నుంచి బయటపడిన వెంటనే తినడానికి ఏమీ ఇవ్వ కూడదు -ఒక వైపుగా తిప్పి పడుకోబెట్టడం వల్ల మూర్ఛ సమయంలో వారి నోట్లోకి వచ్చిన లాలాజలం వంటి స్రావాలు ఊపిరితిత్తుల్లో చేరకుండా నివారించవచ్చు. అది ఎడమ వైపు తిప్పి పడుకోబెడితే మరీ మంచిది.

# టెన్షన్ జయించాలంటే ..



ఈ రోజుల్లో పసివాడు మొదలుకొనిపండుముసలి వరకు అందరూ ప్రతిదినం అనేకమార్లు వల్లించే మాట ఇది. ప్రతి దానికీ ఏదో తెలియనిఆందోళన. ఫలితంగా యవ్వన దశలోనేవివిధశారీరక,మానసికరుగ్మతలు.ఆధునిక జీవన విధానంలో సంక్లిష్టత వల్ల ఏర్పడుతున్న దు:స్థితి ఇది. ఒకవైపు సాంకేతిక వైజ్ఞానిక ప్రగతి, నవ నాగరికత వల్ల ఏర్పాటౌతున్న సుఖభోగాల...ఎన్నిఉన్నాఉద్విగ్నం, బెంగ, దిగులుకొత్త కొత్త తరహాల్లోఎదురౌతున్నాయివీటికి కారణాలేమిటి? పరిష్కారమేమిటి?.. మానసిక స్థైర్యం కొరవడటమే ఈ పరిస్థితికి కారణం. నిజానికి దీనికి పరిష్కారం- పూర్తిగా ఆధారపడదగినది - మన పూర్వీకులే మనకు ఇచ్చారు. బాల్యం నుండే పెంచి పోషించుకుంటున్న పోటీ ప్రవృత్తిని ఒకరిని మించి పోవాలనే తాపత్రయం, అన్నిభోగసాధన లు తమకుఅందుబాటులో ఉండాలని ేలాలస... ఈ విధమైన దృక్పథాలవలన అశాంతికి లోనౌతున్నాడు నవీన మానవుడు. ఆధ్యాత్మిక ధార్మిక ఆలోచనారవళినిపెంపొందించు కోవడమే దీనికి పరిష్కారం. ఎటువంటి పరిస్థితి ఎదురైనా వెంటనే ప్రతికూలం (Negative) గా స్పందించకుండా, ప్రశాంతతని కోల్పోకుండా మసలగలిగే అనుకూల (Positive) ధోరణిని అభ్యాసం చేయాలి.

ఎవరు ఆదర్శం?ఈ మానవలోకానికి 'మిశ్ర' లోకం అని పేరు. సుఖదు:ఖ మిశ్రణమే ఇహలోక వైఖరి. ఈ అనుభవాలకి ఎలా స్పందించాలి?

**దు:ఖేష్వనుద్విగ్నమనా: సుఖేషు విగత స్పృహ:।**
**వీతరాగ భయక్రోధ: స్థిత నీర్మునిరుచ్యతే ॥**

''దు:ఖంలో మనస్సు ఉద్విగ్నం చెందకుండా, సుఖాలలో అంటుకొని పొంగిపోకుండా, మోహం, క్రోధం, భయం వంటి వికారాలకు లోనుకాకుండా ఉండేవాడే స్థితప్రజ్ఞుడు'' అని గీతాచార్యుని మాట జ్ఞాని మన:స్థితి 'సంయమనం' 'సమతుల్యం'గా ఉంటుంది. అలాంటి యోగిని మనం ఆదర్శంగా తీసుకొని పురోగమించిడం సుఖజీవన మార్గం. కానీ మనం అధిక సంపన్నుల్నీ, కీర్తిమంతుల్నీ మనకు 'మోడల్స్' గా ఎంచుకుంటాంగానీ, గొప్ప వ్యక్తిత్వాలను ఆదర్శాలుగా భావించం.పైగా మానసిక దృఢత్వమనేది ఏదో ఆధ్యాత్మిక వాదంగా పరిగణిస్తాం గానీ మానవుని వికాస వ్యక్తిత్వంగా లెక్కించం. ఆందోళన ముందువెనుకల్ని ఆలోచించనీయదు. కార్యశీలతకు భంగకరం కూడా. దూరాన వస్తున్న రామలక్ష్మణుల్ని మొదటి సారిగా చూసిన సుగ్రీవుడు విపరీతమైన టెన్షన్‌కి (ఉద్విగ్నానికి) లోనై, అటూ ఇటూ పచార్లు చేస్తుండగా, హనుమంతుడు గమనించి-'' నువ్వు ప్రశాంతతని కోల్పోతే ఏపనీ చేయలేవు. వారిద్దర్నీ చూసి, 'వాలి నీ పైకి పంపిన బలవంతులైన యోధులు' అని నిర్ణయించుకొని భయపడుతున్నావు. కానీ అది రూఢి కాలేదు. ఏమీ తేలకుండానే ఉద్విగ్నపడే మనస్తత్వమున్న వాడు కార్యదక్షుడు కాలేడు'' అని మందలించి, తాను స్వయంగా వెళ్ళి, రామలక్ష్మణుల సమాచారం గ్రహించాడు. వారిని సుగ్రీవునికి మిత్రులుగా చేసి మహోపకారం చేశాడు. కేవలం కథా దృష్టితో చూస్తే -మారీచుడు మాయాజాలంతో రాముని కంఠస్వరాన్ని అనుకరిస్తూ అరచిన ధ్వనికి - వేగిరపడిని సీతమ్మ ఆందోళనే మాటల్లో వర్ణించలేనంత టెన్షన్‌కి గురయింది. ఆ టెన్షనే చికరికి ఆమె అపహరణం వరకు దారితీసింది. భయచకితమైన మానసిక స్థితిలో తీసుకొనే నిర్ణయాలు ప్రమాదాలకి దారితీస్తాయి.

జరగవలసింది జరగకమానదు - అనే ధోరణి ఒక విధంగా మనశ్శాంతినీ, ఊరటనీ ఇస్తుందనేది వాస్తవమే. కానీ ఈ ధోరణి మన ప్రయత్నాన్ని కుంటుపరచదా? అని కొందరి సందేహం. ఏ సిద్ధాంతాన్నైనా ఎలా, ఎంతవరకు స్వీకరించాలి? అనేది మనయుక్తిపై ఆధారపడి ఉంటుంది భారతీయుల కర్మ సిద్ధాంతాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే చక్కని మన:స్థితిని ఏర్పడుతుంది. కర్మకు తగ్గ ఫలితం అనుభవించక తప్పదు. మన ప్రయత్నం మనం చేసినా తొలగించలేని దానినే ప్రారబ్ధం అంటాం. పురుష ప్రయత్నం తో చేసినదే కదా! ఇది వరకటి కర్మలఫలానికే 'అదృష్టం' 'దైవం' 'భాగ్యం' అని పేరు. ప్రపంచంలో అందరూ ఒకేలా ఉండరు. ఎవరి 'అదృష్టం' వారిది. అలాగని ప్రయత్నం మానం. ప్రయత్నానికి 'పౌరుషం' అని పేరు. మన ప్రయత్నం దృఢంగా, ఏకాగ్రంగా, పట్టుదలగా ఉంటే అదృష్టాన్ని కూడా మార్చవచ్చు అని శాస్త్రం. 'అదృష్టం ఇంతే' అని సరిపెట్టుకునే స్థితి మనసుకి శాంతినిస్తుంది. పట్టుదలగా కృషి చేసేవాడూ ఆందోళనని ప్రక్కకి పెడతాడు.రెండింటికీ చెందని బలహీనుడే అశాంతి పాలవుతాడు. మన కృషికి తగినదీ, మన అవసరాలను తీర్చేదీ అయిన సంపాదనతో తృప్తిపడడం నేర్చుకోవాలి. పోటీ, ఆందోళన లేకుండా ధర్మబద్ధంగా ప్రయత్నించడానికి సాధన చేయాలి. కొందరు ఎల్లప్పుడూ తామున్న ఉద్యోగం, స్థితి విషయంలో అసంతృప్తి గానే గడుపుతుంటారు. 'గతిలేక అందులో ఉన్నాం' అనే భావన లో ఉంటారు. ఇది కూడా ఒక విధమైన మానసిక రుగ్మతయే. 'ఎవరెక్కడవుండాలో అక్కడేసరిగ్గాఉంచబడ్డారు' (Everyone is rightly placed) అనే ఆంగ్లనానుడి కర్మ సిద్ధాంతానికి దగ్గరిదే.

# "ఆంధ్ర కేసరి" టంగుటూరి కి ఘన నివాళి



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా బుధవారం విశాఖ సెంట్రల్ పార్క్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు, సంఘ సంస్కర్త, న్యాయ నిపుణుడు, రాజకీయవేత్త అయిన టంగుటూరి ప్రకాశం పంతులు సేవలు పుడమి ఉన్నంతవరకు జనులు గుర్తించుకుంటారని కొనియాడారు. ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా పనిచేసి రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, మద్రాస్ లో సైమాన్ కమిషనర్ కు వ్యతిరేక ప్రదర్శనలో తుపాకుకు ఎదురెల్లి తన గుండెలను చూపి "ఆంధ్ర కేసరి" అని పేరు పొందారున్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని పలుమార్లు జైలుకు వెళ్లారని తెలిపారు. ఆయన 1872 ఆగస్టు 23న ఒంగోలు జిల్లా వినోదరాయుపాలెంలో జన్మించారని తెలిపారు. టంగుటూరి ప్రకాశం పంతులు సేవలు మరువలేనవని ప్రతి తెలుగు వారు ఆయనను గుర్తుంచుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి అదనపు కమిషనర్లు డాక్టర్ వై శ్రీనివాసరావు, ఎస్ ఎస్ వర్మ, ప్రధాన వైద్యాధికారి నరేష్ కుమార్, జివిఎంసి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏయూతో ఐసిటి అకాడమి ఎంఓయూ




ఆంధ్రవిశ్వవిద్యాలయం **(విజయభాను న్యూస్) :** ఆంధ్రవిశ్వవిద్యాలయంతో ఐసిటి అకాడమి అవగాహన ఒప్పందం చేసుకుంది. బుధవారం ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత సమక్షంలో ఒప్పంద పత్రాలపై ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఐసిటి అకాడమి సిఈఓ హరి బాలచంద్రన్‌లు సంతకాలు చేసారు. ఈ అవగాహన ఒప్పందంలో భాగంగా ఐసిటి అకాడమీకి నోడల్ కేంద్రంగా ఏయూ నిలవనుంది. అదే విధంగా ఏయూ ఆచార్యులకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్-కమ్యూనికేషన్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ విభాగాలలో అవసరమైన సేవలను అందిస్తుంది. పరిశ్రమల అనుసంధానితంగా శిక్షణ కార్యక్రమాలను ఐసిటి అకాడమి నిర్వహిస్తుంది. ఈ సేవలను ఏయూతో పాటు అనుబంధ కళాశాలల అధ్యాపకులు సైతం పొందే అవకాశం ఉంది. అదే విధంగా ఏయూ ఆచార్యులు పరిశోధన పత్రాలను ఐటిసి జర్నల్స్‌లో ప్రచురిస్తారు. కార్యక్రమంలో ఏయూ ఆలుమ్ని అసోసియేషన్ అద్యక్షులు డాక్టర్ ఇ.శంకర రావు, మీడియా రిలేషన్స్ డీన్ ఆచార్య చల్లా రామకృష్ణ, ఐసిటి అకాడమి స్టేట్ హెడ్ దినకర్ రెడ్డి, రీజినల్ మేనేజర్ బి.ప్రవీణ్ కుమార్, ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ అత్యుత్తమ నైపుణ్యాలను అధ్యాపకులకు, విద్యార్థులకు అందించే దిశగా ఈ అవగాహన ఒప్పందం ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు.

# ఓటర్ల జాబితాలోని మార్పులు చేర్పులు చేయుటకు ప్రత్యేక దృష్టి పెట్టాలి



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** ఓటర్ల జాబితాలోని మార్పులు చేర్పులు చేయుటకు అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాధన్ అన్నారు. బుధవారం సాయంత్రం జిల్లా జాయింట్ కలెక్టర్ చాంబర్ లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్షన్ కమీషన్ ఆదేశాల మేరకు ప్రతి వారం వివిధ రాజకీయ పార్టీల ప్రతి నిధులతో సమావేశం ఏర్పాటులో భాగంగా ఈ రోజు సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. రాజకీయ ప్రతి నిధుల దృష్టికి వచ్చిన సమస్యలు తెలియజేస్తే వాటిని పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రతి వారం ఓటర్ జాబితాలో చేర్పులు,తొలగింపులు, మార్పుల సమాచారాన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులకు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో వై.ఎస్.ఆర్ సి పి , టిడిపి, బిజెపి, ఆమ్ ఆద్మీ పార్టీ, ఇతర పార్టీ ప్రతి నిధులు పాల్గొన్నారు.

# ఘనంగా టంగుటూరి ప్రకాశం పంతులు 152 వ జయంతి వేడుకలు



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి , ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని విశాఖ జిల్లా కలెక్టర్ డా ఎ మల్లికార్జున సూచించారు. బుధవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో టంగుటూరి ప్రకాశం పంతులు 152 వ జయంతిని పురస్కరించుకొని కలెక్టర్ తోపాటు జాయింట్ కలెక్టర్ కె యస్ విశ్వనాథన్ పూలమాలలు వేసి ఆయనకు ఘనంగా నివాళులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా ఎ మల్లికార్జున మాట్లాడుతూ ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు సేవా స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు. కడు పేదరికంలో పుట్టినప్పటికీ పట్టుదలతో ఉన్నత స్థాయికి చేరారన్నారు. మహోన్నత ఆశయాలతో జీవితాన్ని కొనసాగించినట్లు తెలిపారు. స్వాతంత్రోద్యమంలో సైమన్ కమిషన్ తుపాకులకు ఎదురు నిలిచిన మహా వ్యక్తి అని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తొలి ముఖ్యమంత్రి గా ఆయన పనిచేసినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, పరిపాలన అధికారి ఈశ్వరరావు, సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ వి. మణిరామ్, డీఈఓ చంద్రకళ , డీఎంహెచ్వో జగదీశ్వరరావు , అడిషనల్ ఎస్ పి, ఎస్ ఇ బి బి. శ్రీనివాసరావు కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## భారత ఏస్ ఆర్చర్ జ్యోతి సురేఖకు సీఎం జగన్ అభినందనలు

తాడేపల్లి: భారత ఏస్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో సీఎంను జ్యోతి సురేఖ బుధవారం కలిశారు. ఇటీవల బెర్లిన్‌లో జరిగిన వరల్డ్ ఆర్చరీ చాంపియన్‌షిప్, ప్యారిస్‌లో జరిగిన ఆర్చరీ వరల్డ్ కప్‌లో పలు పతకాలను ఆమె సాధించారు.



# ఐఎన్‌ఎస్ ఏకశిల సందర్శించిన గీతం విద్యార్థులు



సాగర్‌నగర్ **(విజయభాను న్యూస్) :** భారత నౌకాదళానికి చెందిన ఐఎన్‌ఎస్ ఏకశిల 23 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఐఎన్‌ఎస్ ఏకశిలాను గీతం విద్యార్థులు బుధవారం సందర్శించారు. సంస్థలోని గ్యాస్ టర్బైన్‌లు, జనరేటర్లతో పాటు పలు విభాగాలలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఐఎన్‌ఎస్ ఏకశిల కమాండర్ సంజయ్ అధన విద్యార్థులకు వివరించారు. అనంతరం ఐఎన్‌ఎస్ కళ్యాణిని సందర్శిం చిన గీతం విద్యార్థులకు నౌకాదళంలోని అవకాశాలను గూర్చి కమాండర్ రోహిత్ శర్మ తెలియజేశారు. యువతలో నాయకత్వ లక్షణాలను, వివిధ అంశాలపై లోతైన అవగాహన పెంచడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం యంగ్ లీడర్స్ ప్రోగ్రామ్ ను ప్రారంభించిందని వివిధ ఇంజనీరింగ్ విభాగాల నుంచి 80 మంది ఔత్సాహికులను యంగ్ లీడర్స్ ప్రోగ్రామ్‌కు ఎంపిక చేసి నట్లు గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరక్టర్ సిఎశ్రీరామ్ తెలిపారు. వివిధ వర్క్‌షాప్‌లు, వ్యక్తిత్వ వికాస తరగతులతో పాటు స్థానిక పరిశ్రమలను సందర్శించడం అక్కడి నిపుణులతో ముఖాముఖి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా గీతం విద్యార్థులు స్వచ్ఛంద రక్తదానం చేశారు. కార్యక్రమంలో అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో పలు "బస్సు బే" లను ప్రారంభించిన నగర మేయర్




విశాఖపట్నం, (విజయభాను న్యూస్) : సుందర విశాఖ నగరంలో ప్రజల సౌకర్యార్థం "బస్సు బే"లను ఆధునికరించడం జరుగుతుందని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. బుధవారం ఆమె విశాఖ దక్షిణ నియోజకవర్గం పరిధిలోని జగదాంబ జంక్షన్, ఎల్ఐసి బిల్డింగ్, ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్ గెట్, లలిత జ్యువెలరీ వద్ద ఆధునికరించిన "బస్సు బే" లను దక్షిణ నియోజవర్గం శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ నగరంలో ప్రయాణికులు, స్కూల్ విద్యార్థులు సౌకర్యార్థం నగరంలో పలు బస్ స్టాప్ లను ఆధునికరించడం జరిగిందని, ఇప్పటికే నగరంలో పలు "బస్సు భే" లను ఆధునికరించి ప్రారంభించామన్నారు. ప్రస్తుతం విశాఖ దక్షిణ నియోజకవర్గం పరిధిలో రూ.25.93 లక్షల వ్యయంతో జగదాంబ జంక్షన్ వద్ద "బస్సు బే"ను రూ.26.33 లక్షల వ్యయంతో ఎల్ఐసి బిల్డింగ్ "బస్సు బే", రూ.24.73 లక్షల వ్యయంతో, ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్ గేట్ వద్ద "బస్సు బే", రూ.26.45 లక్షల వ్యయంతో లలిత జ్యువెలరీ వద్ద "బస్సు బే" లను ఆధురకరించి ప్రారంభించామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో విశాఖ నగరం అభివృద్ధి చెందుతుందని ఆయన సూచనల మేరకు ఇప్పటికే పలు "బస్సు బే" లను నిర్మించి ప్రారంభించామన్నారు. త్వరలో విశాఖ నగరం పరిపాలన రాజధాని అవుతుందని ఈ తరుణంలో మంచి "బస్సు బే" అవసరమని భావించి వీటిని ఆధునికరించడం జరిగిందన్నారు. అలాగే మిగిలిన బస్ స్టాపులను నగరమంతా అంచలంచలాగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. అనంతరం దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు మాట్లాడుతూ వై ఎస్ ఆర్ ప్రభుత్వంలో విశాఖ నగరం ఎంతో సుందరంగా తీర్చిదిద్దడం జరుగుతుందని కోట్లాది రూపాయలు వెచ్చించి నగర సుందరీకరణ పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి విశాఖ నగర ప్రజలకు అవసరమయ్యే మౌలిక వసతులు, సంక్షేమము అందించడంలో ముందున్నారని ఇప్పటికే నియోజవర్గం పరిధిలో ఎన్నో అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేస్తున్నామన్నారు.



ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కట్టమూరి సతీష్, కార్పొరేటర్ బిపిన్ జైన్, జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వై శ్రీనివాసరావు, జోనల్ కమిషనర్ శివప్రసాద్, పర్యవేక్షక ఇంజనీరు సత్యనారాయణ రాజు, కార్యనిర్వాహక ఇంజనీరు రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# చంద్రయాన్ కోసం విశాఖ శారదాపీఠంచే వనదుర్గా హెూమం



రిషికేష్ : చంద్రయాన్ అంతరిక్ష నౌక విజయవంతంగా చంద్రుడిపైకి అడుగు మోపాలని ఆకాంక్షిస్తూ విశాఖ శ్రీ శారదాపీఠం ప్రత్యేక పూజలు నిర్వహించింది. చాతుర్మాస్య దీక్షలో ఉన్న పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర స్వాముల పర్య వేక్షణలో బుధవారం వనదుర్గాహెూమం నిర్వ హించారు.

రిషికేష్ లోని విశాఖ శ్రీ శారదాపీఠం ఆశ్రమ ప్రాంగణంలో ఈ హెూమం చేపట్టారు. వనదుర్గా హెూమం పూర్ణాహుతిలో పీఠాధిపతులు పాల్గొన్నారు. భారతావని ప్రతిష్టను మరింత ఇనుమడింప జేసేందుకు చంద్రయాన్ ప్రయోగం దోహదపడుతుందని స్వరూపానందేంద్ర స్వామి పేర్కొన్నారు. ప్రపంచంలో బలీయమైన శక్తిగా భారత్ ఎదగాలనే ఆకాంక్షతోనే వనదుర్గా హెూమం చేపట్టినట్లు తెలిపారు

## అత్యుత్తమ క్రికెటర్‌గా శుభ్‌మన్

ముంబయి: సియట్ క్రికెట్ అవార్డుల వేడుకలో టీమిండియా ఓపెనర్ శుభ్‌మన్ గిల్ ఏకంగా మూడు అవార్డులను చేజిక్కించుకున్నాడు. ముంబయిలో జరిగిన 25వ అవార్డుల వేడుకలో శుభ్‌మన్ గిల్ 'సియట్ మెన్స్ ఇంటర్నేషనల్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్', 'సియట్ ఇంటర్నేషనల్ బ్యాటర్ ఆఫ్ ది ఇయర్', 'సియట్ వన్డే బ్యాటర్ ఆఫ్ ది ఇయర్'.. అవార్డులను కైవసం చేసుకున్నాడు. 2022-23 సీజన్‌లో అత్యుత్తమ ప్రదర్శన చేసిన మహిళా, పురుష క్రికెటర్లను సియట్ సంస్థ మంగళవారం ఘనంగా సత్కరించింది. మాజీ సెలెక్టర్ మదన్ లాల్‌తో పాటు కర్సన్ ఘవ్రీ కూడా ఈ అవార్డు సొంతం చేసుకున్నాడు. 'టెస్టు బౌలర్‌గా' ప్రభాత్ జయసూర్య, 'టి20 బ్యాటర్'గా సూర్యకుమార్ యాదవ్ ఎంపికయ్యారు. 'ఉమెన్స్ ఇంటర్నేషనల్ క్రికెటర్'గా ఆల్‌రౌండర్ దీప్తి శర్మ,

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com